కార్మికుల సంక్షేమం కోసమే
వెల్ఫేర్ బోర్డు
- సిడబ్ల్యుఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు

3

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 47 | విజయవాడ, శనివారం 16 సెప్టెంబర్ 2023 | 6+8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Saturday16 September 2023 | Rs



శుభ్‌మన్ సెంచరీ వృథా
- నామమాత్రపు మ్యాచ్‌లో బంగ్లాదేశ్ చేతిలో ఆరు పరుగుల తేడాతో ఓటమి

6

బీమాలో మళ్లీ ప్రైవేటు కంపెనీలు



- నిరుడు ఫసల్‌లోనే
- ఈ ఏడాది వెదర్ బేస్డ్ ఇన్సూరెన్స్ కూడా
- అన్ని జిల్లాలూ వాటికే అప్పగింత
- కేంద్రం అడుగుజాడల్లో రాష్ట్ర సర్కార్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

గతేడాది ఖరీఫ్‌లో విపత్తులతో పంటలు నష్టపోయిన రైతులను ప్రైవేటు బీమా కంపెనీలు నిలువునా ముంచిన అనుభవం ఉండగానే, ప్రభుత్వం ఈ సంవత్సరం మరింతగా ప్రైవేటు కంపెనీలను ప్రవేశపెట్టింది. నిరుడు కేవలం దిగుబడి ఆధారిత బీమాలోకే (ఫసల్) కొన్ని ప్రైవేటు సంస్థలు రాగా ఈ తడవ వాతావరణ ఆధారిత బీమాను కూడా ప్రైవేటు కంపెనీలకు అప్పగించింది. ఫసల్‌లో కొన్నే ప్రైవేటు కంపెనీలుండగా వాతావరణ బీమా మొత్తాన్నీ ప్రైవేటు కంపెనీలు చేజిక్కించుకున్నాయి. 2023-24 ఖరీఫ్, రబీలో పంటల బీమా అమలు కోసం ఇన్సూరెన్స్ కంపెనీలను ప్రభుత్వం ఖరారు చేసింది. రాష్ట్రంలోని జిల్లాలను క్లస్టర్ల వారీగా విభజించి ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీలను గ్లోబల్ టెండర్ల ద్వారా ఎంపిక చేసింది. బీమా వర్తించే పంటలనూ నోటిఫై చేసింది. ఈ విషయాలపై ప్రభుత్వం గోప్యత పాటిస్తోంది. పంటల నోటిఫికేషన్ల ను, జిఓలను అంతర్గతంగా జిల్లా వ్యవసాయాధి కారులకు (డిఎఒ) ఇప్పుడిప్పుడే వాట్సాప్‌ల్లో పంపుతోంది.

కేంద్రం ఒత్తిడితోనే

కేంద్ర పంటల బీమా పథకం ఫసల్ వలన ప్రైవేటు కంపెనీలు లాభపడుతున్నాయని, రైతులకు సకాలంలో క్లెయిములు అందక నష్టం జరుగుతోందని వైసిపి సర్కారు వచ్చాక తానే స్వయంగా బీమా పథకాలు అమలు చేసింది. కేంద్రం తన వాటా నిధులు బిగబట్టి, తమ పథకాల్లో చేరాలని ఒత్తిడి చేయడంతో నిరుటి నుంచి కేంద్ర పథకాల్లో చేరింది. ఫసల్‌లో గతేడాది కంపెనీలను ఆహ్వానించింది. వాతావరణ బీమాను అంతకుముందు మల్లే తానే అమలు చేసింది. ఈ సంవత్సరం వాతావరణ ఆధారిత బీమాను సైతం కేంద్రం పరిధిలోకి తీసుకెళ్లి అక్కడా కంపెనీలను ప్రవేశపెట్టింది.

అధిక ప్రీమియం

ఫసల్‌లోకి ఈ తడవ బజాజ్ ఎలియాంజ్ రెండు క్లస్టర్లకు, హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో ఒక క్లస్టర్‌కు ఎంపికయ్యాయి. ప్రభుత్వరంగ సంస్థలైన ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కొన్ని క్లస్టర్లకు ఎంపికయ్యాయి. నిరుడు కేంద్ర వ్యవసాయశాఖ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థ ఎఐసి ఐదు జిల్లాలకు ఎంపిక కాగా ఈ మారు ఆ కంపెనీ లేదు. ఈ ఏడాది నుంచి కేంద్ర పథకంలో చేరిన వాతావరణ బీమాలో ఒక్క ప్రభుత్వరంగ సంస్థ కూడా లేదు. అన్నీ ప్రైవేటు కంపెనీలనే ఎంపిక చేశారు. ప్రైవేటు కంపెనీలు కోట్ చేసిన ప్రీమియం రేటు చాలా ఎక్కువగా ఉంది. ప్రభుత్వరంగ సంస్థలు తక్కువ ప్రీమియం కోట్ చేయగా, అత్యధికంగా 12.56 శాతం సగటు ప్రీమియం రేటును ప్రైవేటు సంస్థలు కోట్ చేసి పోటీలో నిలిచాయి. ఖరీఫ్‌లో సాధారణ వ్యవసాయ పంటలకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం 2 శాతం, రబీలో 1.5 శాతం. రెండు సీజన్లలోనూ హార్టికల్చర్ పంటలకు 5 శాతం. రైతు వాటా పోను ప్రీమియంలో మిగతా భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం భరించాలి. మన రాష్ట్రంలో ఉచిత పంటల బీమా కావడంతో రైతు వాటాను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఏతావాతా ప్రైవేటు కంపెనీలు కోట్ చేసే మొత్తాన్నీ ప్రభుత్వాలే కట్టాలి. ఎక్కువ ప్రీమియానికి ఏజెన్సీలను ఎంపిక చేస్తే ఆ భారం ప్రభుత్వాలపై, అంతిమంగా ప్రజలపై పడుతుంది. కంపెనీలు గరిష్ట లాభాలు పోగేసుకుంటాయి.

రబీ పరిహారం ఇంకా లేదు

2022-23 రబీలో విపత్తులకు మిగతా 2లో



కార్మికోద్యమ నేత కనయ్ బెనర్జీ కన్నుమూత

న్యూఢిల్లీ : స్వాతంత్ర్య ఉద్యమ నేత, ప్రముఖ కార్మిక సంఘ నేత, సైద్ధాంతికవేత్త, సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు కనయ్ లాల్ బెనర్జీ (97) శుక్రవారం ఉదయం కోల్‌కతా లోని తన నివాసంలో కన్నుమూశారు. గత కొద్ది కాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్యాలకు ఆయన చికిత్స తీసుకుంటున్నారు. వైద్య పరిశోధనల నిమిత్తం ఆయన శరీరాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. తూర్పు పాకిస్తాన్‌లోని ఢాకా రాణి మండల్‌లోని బిక్రమ్‌పూర్‌లో 1926 అక్టోబరు 10న జన్మించారు. దేశ విభజన తర్వాత భారత్‌కు ఆయన కుటుంబం వచ్చేసింది. విద్యార్థిగా స్వాతంత్ర్య ఉద్యమంలో చేరిన కన్నయ్య ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. రైల్వే ఉద్యోగిగా చేసిన ఆయన రైల్వేలో కార్మిక ఉద్యమం అభివృద్ధికి కృషి చేశారు. సిఐటియు కేంద్ర ఆఫీసు బేరర్‌గా పనిచేశారు.

పొలిట్‌బ్యూరో సంతాపం

కార్మిక ఉద్యమం అభివృద్ధికి బేనర్జీ కీలకమైన సేవలందించారంటూ ఆయన మృతి పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో సంతాపం వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేసింది. తత్వశాస్త్రం, సంస్కృతి గురించి చాలా ఆసక్తి కలిగిన ఆయన వాటిలో ప్రావీణ్యతను సంపాదించారు. కనయ్ చాలా నిరాడంబర జీవితాన్ని గడిపారు. పార్టీ కార్యకర్తల పట్ల చాలా ప్రేమగా వుండే ఆయన రాజకీయ సైద్ధాంతిక పోరులో రాజీ పడేవారు కాదు. ఆయన మృతి పార్టీకి తీరని నష్టమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆయన సృజనాత్మక రచనలు కూడా చేశారు. మార్క్సిజం - లెనినిజం పై విశ్లేషణాత్మక సామర్ధ్యాన్ని కలిగివుండేవారని పొలిట్‌బ్యూరో గుర్తు చేసుకుంది. 2008 వరకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా సేవలందించారు.

వైద్య పోస్టుల భర్తీలో
ముందంజ

- 53 వేల మందికి పైగా నియామకం
- ఐదు మెడికల్ కాలేజీల ప్రారంభోత్సవంలో సిఎం జగన్



వైద్య విద్యార్థులతో కలిసి ఫొటో దిగుతున్న సిఎం, మంత్రి రజిని, తదితరులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో దశలవారీగా 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందన్నారు. వైద్యులు, సిబ్బంది భర్తీలో కేంద్రంతో పోలిస్తే రాష్ట్ర ప్రభుత్వమే మెరుగ్గా ఉందని చెప్పారు. విజయనగరం ప్రభుత్వ మెడికల్ కాలేజీని నేరుగా, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల మెడికల్ కాలేజీలను వర్చువల్‌గా శుక్రవారం సిఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. అనంతరం మెడికల్ కాలేజీల విద్యార్థులు, ఆయా జిల్లాల కలెక్టర్లు, పిజి విద్యార్థులతో ఆన్‌లైన్‌లో ముచ్చటించారు. అనంతరం సిఎం మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రాష్ట్రంలో కేవలం 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 17 మెడికల్ కాలేజీలు ప్రారంభించేందుకు ప్రణాళిక చేసిందని అన్నారు. అందుకోసం రూ. 8,480 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే తొలి విడతగా ఏర్పాటు చేసిన ఐదు కాలేజీల్లో అడ్మిషన్లు, భవన సముదాయాలు ప్రారంభిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది మరో ఐదు కాలేజీలను, ఆ మరుసటి ఏడాది మరో ఏడు కాలేజీలు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలోనూ ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ఉన్న మెడికల్ కాలేజీల్లో 2,185 సీట్లు ఉన్నాయని, తాజాగా ప్రారంభించిన ఐదు కళాశాలల్లో సీట్ల సంఖ్య 2,935కి చేరుతుందని వివరించారు. తాము తలపెట్టిన మిగిలిన 12 కాలేజీలు పూర్తయితే మొత్తంగా రాష్ట్రంలో 4,735 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మరో 18 నర్సింగ్ కాలేజీలను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. ఈ కాలేజీల ద్వారా పీజీ మెడికల్ సీట్ల సంఖ్య నాలుగేళ్లలో 966 నుంచి 1,767కు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకుని సమాజానికి సేవలందించాలని విద్యార్థులకు సూచించారు.

గత నాలుగేళ్లలో రూ.16,852 కోట్లతో 17 కొత్త వైద్య కళాశాలలు, వివిధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణంతో పాటు నాడు-నేడు ద్వారా ప్రభుత్వాస్పత్రులకు జవసత్వాలు వచ్చాయన్నారు. ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీచేస్తున్నామని, ఇప్పటి వరకు దాదాపు 53 వేల మందికి పైగా వైద్యులను నియమించామని వివరించారు. ఇందుకోసమే ప్రత్యేకంగా రిక్రూట్‌మెంట్ బోర్డు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో స్పెషలిస్టు వైద్యులు 3.96శాతం మాత్రమే ఉండగా, రాష్ట్రంలో 61 శాతం వరకు ఉన్నారన్నారు. 26 శాతం నర్సింగ్ పోస్టులు, 33 శాతం ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులు జాతీయ స్థాయిలో కొరత ఉండగా, రాష్ట్రంలో ఈ రెండు విభాగాల్లో పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేశామని తెలిపారు. టిడిపి హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్యశ్రీని బలోపేతం చేశామని, ఆరోగ్యశ్రీ కింద వర్తించే వ్యాధులను, జబ్బులను 1,059 నుంచి ఏకంగా 3,257కి పెంచామన్నారు. 40 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం కోసం రూ.ఎనిమిది వేల కోట్లు వెచ్చించామని చెప్పారు. గతంలో జగనన్న సురక్ష ద్వారా 93 లక్షల డాక్యుమెంట్స్ ఇచ్చామని గుర్తుచేశారు. వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరాతో విశ్రాంతి సమయంలో జీవన భృతి చెల్లిస్తున్నామని, ఇప్పటివరకూ 17.25 లక్షల మందికి రూ.1,074.69 కోట్లు అందించామని తెలిపారు.

కార్యక్రమంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి మురళీధర్‌రెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి ఎం.దీపిక, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మళ్లీ అగ్రిగోల్డ్ పోరు

- విజయవాడకు తరలివచ్చిన బాధితులు
- పలువురి అరెస్ట్
- నిర్బంధాన్ని ఖండించిన అఖిలపక్షం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళన మళ్లీ రాజుకుంటోంది. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ పిలుపుమేరకు విజయవాడకు బయలుదేరిన బాధితులను ఎక్కడికక్కడే పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌లను తప్పించుకుని విజయవాడకు చేరకున్నా ఎటువంటి నిరసనకు అనుమతివ్వలేదు. జింఖానా గ్రౌండ్‌లో అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి పోలీసులు అనుమతి నిరాకరించారు. ధర్నా చౌక్ వద్ద నిరసనకు, దాసరి భవన్‌లో సమావేశం జరుపుకోవడానికి కూడా అంగీకరించకుండా పెద్దసంఖ్యలో అరెస్ట్‌లు చేశారు. దాసరి భవన్ చుట్టూ పోలీసులు మొహరించారు. పోలీసుల ఈ తీరును సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, లోక్‌సత్తా తదితర పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

నిర్బంధం తగదు : వి శ్రీనివాసరావు

రాష్ట్రంలో శాంతియుత పద్దతుల్లో నిరసనలు తెలిపేందుకు విజయవాడకు తరలి వస్తున్న అగ్రిగోల్డ్ బాదితులను పోలీసులు ఎక్కిడికక్కడే అరెస్ట్ చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో బాధితులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 32 లక్షల కుటుంబాల కష్టార్జితాన్ని కొల్లగొట్టిన అగ్రిగోల్డ్ యజమాన్యంపై ఇప్పటిదాకా ప్రభుత్వం చర్యలు తీసుకోక పోగా న్యాయం చేయాలని కోరిన బాదితులను అరెస్ట్ చేయడం తగదని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికైనా తాను ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేల కోట్ల ఆస్తులు వున్న అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకొని బాధితులకు రూ 3,080 మిగతా 2లో

ఆదిత్య ఎల్1 కక్ష్య పెంపు
నాలుగోసారీ విజయవంతం

బెంగుళూరు : సూర్యుడిపై అధ్యయనం కోసం చేపట్టిన ఆదిత్య-ఎల్1 మిషన్ కక్ష్య పెంపు ప్రక్రియ నాలుగోసారీ విజయవంతమైనట్లు ఇస్రో శుక్రవారం తెలిపింది. దీంతో ఉపగ్రహం లాగ్రాజియన్ పాయింట్ 1 లోకి వెళ్తుందని, భూ కక్ష్య నుంచి దూరం అవుతుందని పేర్కొంది. ఈ మేరకు ఇస్రో శుక్రవారం ఎక్స్ (ట్విట్టర్)లో పోస్ట్ చేసింది. తెల్లవారుజామున ఆదిత్య ఎల్1.. మరో కక్ష్యలోకి ప్రవేశించిందని పేర్కొంది. ఈ ఆపరేషన్ చేపట్టిన సమయంలో.. మారిషస్, బెంగుళూరు, షార్, పోర్టు బ్లెయిర్‌లో ఉన్న ఇస్రో స్టేషన్లు ఆ శాటిలైట్‌ను ట్రాక్ చేసినట్లు వెల్లడించింది. ఫిజి దీవుల నుంచి ఆదిత్య ఎల్1కు చెందిన పోస్టు బర్న్ ఆపరేషన్స్ పర్యవేక్షిస్తున్నారు. కొత్త కక్ష్య 256 కి.మీ x 121973 కి.మీ దూరంలో ఉన్నట్లు ఇస్రో పేర్కొన్నది. మళ్లీ ఈ నెల 19వ తేదీ ఉదయం 2 గంటలకు కక్ష్య పెంపు ఆపరేషన్ చేపట్టనున్నట్లు తెలిపింది. తొలి మూడు కక్ష్య పెంపు ప్రక్రియలను ఈ నెల 3, 5, 10 తేదీల్లో చేపట్టారు.

రక్తమోడిన రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి
- 14 మందికి తీవ్రగాయాలు
- మృతుల్లో ఐదుగురు కర్ణాటక, నలుగురు ఒడిశా వాసులు



లారీని వెనుక నుంచి ఢీకొట్టిన అంబులెన్స్

ప్రజాశక్తి-పీలేరు, చిత్తూరు అర్బన్

రాష్ట్రంలో రహదారులు రక్తమోడుతున్నాయి. అన్నమయ్య జిల్లా, తిరుపతిలో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో శుక్రవారం తొమ్మిది మంది మృతి చెందారు. 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

కర్ణాటక రాష్ట్రం బెల్గాం జిల్లా అథణి తాలూకా బడచి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన మొత్తం 15 మంది శ్రీశైలం, తిరుమల దైవ దర్శనానికి నాలుగు రోజుల క్రితం తుఫాన్ వాహనంలో వచ్చారు. తిరుమలలో రద్దీ ఎక్కువుగా ఉండడంతో దైవదర్శనం చేసుకోకుండా గురువారం రాత్రి తమ స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున కె.విపల్లి మండలం మఠంపల్లి సమీపంలో వీరి వాహనాన్ని సిమెంట్ లారీ ఢీకొట్టింది. డ్రైవర్ హనుమంతు సిద్దోలు జాదవ్ (30), దంపతులు అజూరు హనుమంతు(38), అజూరు మనంద(38), తల్లీ, కుమార్తె అజూరు శోభ (36), అజూరు అంబిక(14) అక్కడికక్కడే మరణించారు. గాయపడిన 11 మందిని తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

బెంగళూరు నుంచి ఒడిశాకు వెళ్తున్న అంబులెన్స్ చిత్తూరు -బెంగుళూరు బైపాస్ తెల్లగుండ్ల పల్లి వద్ద రోడ్డు పక్కన నిలిచి ఉన్న ఆయిల్ ట్యాంకర్‌ను వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భువనేశ్వర్‌కు చెందిన మంజులతనాయక్, త్రిలోచన నాయక్, ఉమేష్ చంద్ర, విజయ్‌షాకీ అక్కడికక్కడే మృతి చెందారు. అంబులెన్స్ డ్రైవర్ సంజయ్ కుమార్, జితిన్‌కుమార్, అంబులెన్స్ టెక్నిషన్ దేపాటిరాతదాస్ తీవ్రగాయాలపాలయ్యారు. వీరిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సిడబ్ల్యుసి సమావేశం

- 18 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లో
- ఐదు రాష్ట్రాల ఎన్నికలు, జమిలి, పార్టీ బలోపేతంపై చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ అత్యున్నత ఫోరం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సిడబ్ల్యుసి) సమావేశానికి టిపిసిసి సర్వం సిద్ధం చేసింది.18 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న సమావేశానికి భారీ ఏర్పాట్లు చేసింది. 2005లో ఉమ్మడి రాష్ట్రంలో ఎఐసిసి ప్లీనరీ, సిడబ్ల్యుసి సమావేశం జరిగింది. అంతకు ముందు 1995లో తిరుపతిలో సిడబ్ల్యుసి సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు హైదరాబాద్ వేదికగా నిలిచింది. శుక్ర, శనివారం రెండు రోజులపాటు హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో సిడబ్ల్యుసి సమావేశం జరగనుంది. దేశం నలుమూలల నుంచి 90 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. విస్తృత సమావేశానికి పిసిసి అధ్యక్షులు, సిఎల్‌పి నేతలు, కాంగ్రెస్ పాలిత ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుకానున్నారు. త్వరలో ఎన్నికలు జరిగే తెలంగాణ, రాజస్థాన్, మిజోరం, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఇండియా కూటమి బలోపేతం, పెరుగుతున్న మతోన్మాదం, జమిలి ఎన్నికలతోపాటు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత అంశాలపై కాంగ్రెస్ అగ్ర నాయకత్వం మేథోమథనం చేయనుంది. కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌గాంధీ పేరుపై ప్రాథమికంగా చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

సిడబ్ల్యుసి సమావేశంలో ఆ తీర్మానాన్ని చేసి ఇండియా కూటమి సమావేశంలో ప్రతిపాదించనున్నట్టు సమచారం. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, అధ్యక్షులు, మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు, తదితరులు శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు రానున్నారు. ఆదివారం తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభను స్థానిక నేతలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇక్కడి నుంచే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల శంఖారావం పూరించనుంది. అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలు ప్రసంగించనున్నారు. ఈ సభలో సోనియగాంధీ ఆరు హామీలను ప్రకటించనున్నారు. అందులో కర్ణాటక తరహాలో గృహాలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అసైన్డ్ భూములకు యాజమాన్యపు హక్కులు కల్పించడం, యువత, రైతులకు ప్రత్యేక భరోసా కల్పించనున్నారు.

ఎస్ఐ పరుగు పందెంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



గుంటూరు రేంజ్ పరిధిలో జరుగుతున్న ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలో శుక్రవారం అపశృతి చోటు చేసుకుంది. పరుగు పందెం చేస్తుండగా ఒక్కసారిగా అభ్యర్థి కుప్పకూలిపోయి మరణించారు. గుంటూరు లోని అంకిరెడ్డిపాలెంలో నివశిస్తున్న ఎన్.మోహన్‌కుమార్ (32) ఎస్ఐ ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన తరువాత దేహదారుఢ్య పరీక్షలకు ఎంపికయ్యారు. స్థానిక పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్‌లో 1600 మీటర్ల పరుగు పందెంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అతన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. 2019లో ఇతను సచివాలయ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఎస్ఐ ఉద్యోగం సాధించి వివాహం చేసుకోవాలని అనుకున్నారని, ఇంతలోనే ఇలా జరగడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఆయనకు తల్లి, ఓ సోదరి ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్ షా కోసం..!

- ఢిల్లీలో లోకేష్ ప్రయత్నాలు
- నేడు టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసేందుకు టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఢిల్లీలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. లోకేష్ సూచనతో టిడిపి రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర అమిత్‌షా అపాయింట్‌మెంట్ ను శుక్రవారం కోరినట్లు తెలిసింది. ఒకటి, రెండు రోజుల్లో అప్పాయింట్‌మెంట్ ఖరారయ్యే అవకాశం ఉందని టిడిపి వర్గాలు తెలిపాయి. స్కిల్ స్కామ్‌లో ఆయన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్ట్ అయిన తరువాత మొదటిసారిగా గురువారం సాయంత్రం లోకేష్ ఢిల్లీకి వెళ్లిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను కేంద్ర ప్రభుత్వ పెద్దలకు వివరించడం, వివిధ పార్టీల నాయకులను కలిసి మద్దతు కోరడం, జాతీయ మీడియాకు వాస్తవాలను తెలియచేయడం లోకేష్ పర్యటన లక్ష్యాలుగా చెబుతున్నారు. శుక్రవారం ఆయన కొందరు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులను కలిశారు. 18వ తేది నుంచి



పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో టిడిపి ఎంపిలతో ఆయన శనివారం భేటీ కానున్నారు. పార్లమెంటులో బాబు అరెస్ట్‌ను ప్రస్తావించే అంశంపై ఆయన దిశా నిర్దేశం చేయనున్నారు.

కావాలనే ఆరోపణలు

కొందరు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చంద్రబాబుపై కావాలనే కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. దీనివెనుక రాజకీయ కుట్ర ఉందని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఎటువంటి కుంభకోణం జరగలేదని చెప్పారు. ఆ విషయాన్ని తాను నిరూపించగలనని అన్నారు.

నిర్బంధం తీవ్రమైతే ...

చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా విజయవాడ లోని కొన్ని కళాశాలల విద్యార్థులు ఆందోళనకు సిద్ధమైనారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు తరగతులను సస్పెండ్ చేయించి, కళాశాలలకు సెలవు ప్రకటించారు. దీనిపై స్పందించిన లోకేష్ 'నిర్బంధం తీవ్రమైతే తిరుగుబాటు ఉధృతమమౌతుంది' అని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.



చంద్రబాబు భద్రతపై ఎన్ఎస్‌జి ఆందోళన
- కేంద్ర హోంశాఖకు నివేదిక

స్కిల్ వ్యవహారాలపై వెబ్‌సైట్
- టిడిపి నేతల ఆవిష్కరణ
- మంత్రివర్గ ఆమోదంతోనే నాటి ఒప్పందాలు

2

ఏ ఆధారాలతో చంద్రబాబును అరెస్ట్ చేశారు?

- సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏ ఆధారాలతో అరెస్ట్ చేశారని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. ఆయనను అరెస్టు చేసిన విధానం సరైనది కాదని అన్నారు. ఆయన హన్మకొండలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఎఫ్ఐఆర్‌లో చంద్రబాబు పేరు లేదు, అరెస్టు చేసేముందు కనీసం ఎందుకు అరెస్టు చేస్తున్నారో కూడా చెప్పకుండా ఎపి పోలీసులు అడ్డగోలుగా వ్యవహరించారని విమర్శించారు. చంద్రబాబు అరెస్టు భారత రాజకీయ నమూనా మార్పునకు సంకేతంగా భావిస్తున్నామన్నారు. అధికారంలో ఉన్నవారు తమకు నచ్చనివారిపై నిరంకుశత్వ వైఖరి చూపడం పౌర సమాజానికి, దేశ సంస్కృతికి సరైంది కాదని తెలిపారు.

మోడీ పాలనంతా అప్పుల మయమే

- తులసిరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిందని కాంగ్రెస్ పార్టీ మీడియా ఛైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోడీ పాలనలో గతంలో ఎన్నడూ లేని స్థాయిలో నిరుద్యోగం పెరిగిందన్నారు. మణిపూర్‌లో కనీవిని ఎరుగని విధంగా మారణ హోమం జరిగిందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రమూ అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యునికి అందుబాటులో లేకుండా పోయాయన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పవన్‌ది అనైతిక రాజకీయం

- మంత్రి జోగి రమేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒకవైపు బిజెపితో పొత్తులో వుంటూ ఏమాత్రం వారితో సంప్రదించకుండా టిడిపితో పవన్‌కల్యాణ్ పొత్తుల ప్రకటన చేయడం అనైతిక రాజకీయాలకు పరాకాష్ట అని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును పరామర్శకు వెళ్లిన పవన్‌కల్యాణ్ పొత్తులతో బయటకు రావడం ఇప్పటిదాకా ఎక్కడా జరిగి వుండదని అన్నారు. ఇంత హడావిడిగా టిడిపితో పొత్తులు పెట్టుకున్నారంటే స్కిల్ స్కామ్‌లో పవన్‌కల్యాణ్‌కు కూడా వాటా వుంటుందని అనుమానం వ్యక్తం చేశారు. తన తండ్రిని రక్షించాలని అందరి కాళ్లు పట్టుకునేందుకు నారా లోకేష్ ఢిల్లీ పర్యటనకు వెళ్లారని విమర్శించారు.

అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై బుగ్గన సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ సమావేశాల నిర్వహణపై అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో అసెంబ్లీ వ్యవహారాలు, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ నెల 21న ఉదయం 9 గంటలకు శాసనసభ, 10 గంటలకు శాసనమండలి సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ నేపథ్యంలో సమావేశాల నిర్వహణ, భద్రత, వసతుల ఏర్పాట్లు తదితర విషయాలపై చీఫ్ విప్, విప్‌లతో చర్చించారు. అదేరోజు శాసనసభ వ్యవహారాల కమిటీ సమావేశం ఉంటుందన్నారు. గతంలో లాగానే ఈ సమావేశాలకు అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని బుగ్గన ఆదేశించారు. ఈ సమీక్షలో చీఫ్ విప్ ముదునూరి నాగరాజ వర ప్రసాదరాజు, విప్‌లు జంగా కృష్ణమూర్తి, కాపు రామచంద్రారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జొన్నగిరిలో దొరికిన వజ్రం

ప్రజాశక్తి -తుగ్గలి (కర్నూలు)

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పరిధిలోని జొన్నగిరి గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఒక రైతుకు అత్యంత విలువైన వజ్రం లభ్యమయింది. ఆ వజ్రాన్ని మద్దికేర మండలం పెరివలి చెందిన ఒక వజ్రాల వ్యాపారి రూ. ఎనిమిది లక్షలకు తీసుకున్నట్లు సమాచారం. వర్షం పడితే తుగ్గలి మండలం జొన్నగిరి, పగిడిరాయి, ఎర్రగుడి ఉప్పర్లపల్లి, తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో అత్యంత విలువైన వజ్రాలు లభ్యమవుతాయి. ఈ వజ్రాలను అనంతపురం జిల్లా గుత్తి, కర్నూలు జిల్లా మద్దికేర మండలం పెరవలి, తుగ్గలి మండలం జొన్నిగిరికి చెందిన వ్యాపారులు కొనుగోలు చేస్తారు.

కొబ్బరి రైతు విలవిల



- కనీస ధర రూ.15 ఇవ్వాలి
- రైతులను దోచేస్తున్న దళారీ వ్యవస్థ
- నేడు కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొబ్బరి సాగు చేసే రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సరైన ధర లేక రైతులు కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. కొబ్బరి రైతుల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో వారికి ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సు జరుగనుంది. కొబ్బరి రైతుల సమస్యలపై ఆ సదస్సులో పలు తీర్మానాలు చేయనున్నారు.

కొబ్బరి ఉత్పత్తిలో రాష్ట్రం నాలుగో స్థానంలో ఉంది. దాదాపు 3.50 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 50 వేల ఎకరాల్లో రైతులు కొబ్బరి సాగు చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగిపోవడంతో ఎకరా కొబ్బరి సాగుకు రూ.40 వేలు వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. చెట్టు నుండి కాయలు తీసి గుట్టగా వేసేందుకు ఒక్కో కాయకు రూ.3 ఖర్చవుతోంది. కొబ్బరి కాయకు వ్యాపారులు రైతులకు ఇచ్చే ధర ఆరేడు రూపాయలకు మించడం లేదు. ఇది చాలదన్నట్లు వంద కొబ్బరికాయలు కొనుగోలు చేస్తే పది కాయలు ఉచితంగా తీసుకునే సంప్రదాయం నడుస్తోంది. ఎకరా విస్తీర్ణంలో 60 వరకు కొబ్బరి చెట్లు ఉంటాయి. గతంలో ఒక్కో కొబ్బరి చెట్టుకు రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు ఇచ్చి వ్యాపారులు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఒక్కో చెట్టుకు రూ.600 నుంచి రూ.700 మాత్రమే ఇస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గతంలో ఎకరాకు రూ.60 వేలు ఆదాయం రాగా ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండాపోయింది. మోడీ సర్కార్ విదేశీ కొబ్బరి దిగుమతులకు అవకాశం కల్పిస్తోంది. కొబ్బరి మార్కెట్ పూర్తిగా వ్యాపారుల కంబంధహస్తాల్లోనే నడుస్తోంది. కొబ్బరికాయ ధర కనీసంగా రూ.15 ఉంటే రైతులకు గిట్టుబాటు అయ్యే అవకాశం ఉంటుందని రైతులు కోరుతున్నారు. శనివారం జరగబోయే కొబ్బరి రైతుల రాష్ట్ర సదస్సులో పలు డిమాండ్లను ప్రభుత్వం ముందుంచే అవకాశం ఉంది. కొబ్బరి సాగయ్యే అన్ని జిల్లాల్లో నాఫెడ్, ఆయిల్‌ఫెడ్ ద్వారా కొబ్బరి పంటను కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు.


రైతుల కోసమా? బీమా కంపెనీల కోసమా?

పంటల బీమాపై రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2023-24 సంవత్సరానికి సంబంధించి నిర్ణయించిన పంటల బీమా పథకం రైతాంగానికి నష్టదాయకమైనదిగా, కార్పొరేట్ కంపెనీలకు లాభదాయకమైనదిగా ఉందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి తెలిపారు. ప్రతిపాదిత బీమా నిబంధనలను పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయ తలపెట్టిన పంటల బీమా విధానం రైతుల కోసమా? ఇన్సూరెన్స్ కంపెనీల కోసమా? అన్న సందేహం ఉత్పన్నం అవుతోందని అన్నారు. ఈ విధానాన్ని రద్దుచేయాలన్నారు.రైతులందరికి అందేలా పంటలబీమా పథకాన్ని అమలు జరపాలని కోరారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా రైతుల కంటే ఇన్సూరెన్స్ కంపెనీల లాభాల కోసం ఉద్దేశించినట్లు ఉందని పేర్కొన్నారు. ప్రైవేటు కార్పొరేట్ ఇన్సూరెన్స్ కంపెనీల లాభాల కోసం కేంద్ర ప్రభుత్వం ఫసల్ బీమాను అమలు చేస్తోందని వివరించారు. అటువంటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే బీమా ప్రీమియం కోసం రైతుల ప్రయోజనాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు తాకట్టు పెట్టడం రైతు ప్రభుత్వంగా చెప్పుకునే మీ ప్రభుత్వానికి తగదన్నారు. రాష్ట్ర వ్యవసాయ, సహకార విభాగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల తొమ్మిదో తేదీన విడుదల చేసిన జిఒ నెంబర్ 660ను పరిశీలిస్తే రాష్ట్రంలో వాతావరణ బీమా, దిగుబడి ఆధారిత బీమా అంటూ రెండు పద్ధతుల్లో అమలు చేయనున్నారని వివరించారు. ప్రభుత్వం ఈ విషయమై నోటిఫికేషన్ విడుదల చేయబోతోందని, దీనిపై నిర్ణయించిన రాష్ట్ర పంటల బీమా మొత్తాన్ని ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టే పద్ధతి వెంటనే నిలుపుదల చేసి వ్యవసాయశాఖ ద్వారా గతంలో అమలుజేసిన విధానాన్ని అమలు జరపాలని రైతు సంఘం డిమాండ్ చేసింది.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం



ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకుంటామని వైఎస్ఆర్‌టియు నాయకులు కర్రి దాలినాయుడు, కె ఈశ్వరరావు, రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్ సూరప్పడు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 895వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో వైఎస్ఆర్‌టియు కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు అమ్మేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పూనుకోవడం దుర్మార్గమన్నారు. ఈ పరిశ్రమ ఉండటం వల్ల ఉత్తరాంధ్రలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయన్నారు. ఆ విషయాన్ని విస్మరించి ప్రభుత్వం ముందుకెళ్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కోక తప్పదన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ వ్యాప్తమైందని తెలిపారు. సొంత గనులు కేటాయించి, పూర్తి సామర్థ్యంలో ప్లాంట్‌ను నడిపించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

విద్యుత్ రంగం బలోపేతమే లక్ష్యం

- ఇంజనీర్లు 'మోక్షగుండా'న్ని ఆదర్శంగా తీసుకోవాలి
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ రంగాన్ని సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్నారు. భారత రత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి కార్యక్రమం విజయవాడలోని విద్యుత్ సౌధలో శుక్రవారం జరిగింది. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళలర్పించారు. విద్యుత్ శాఖలో ఉన్న ఇంజనీర్లు, ఇతర సిబ్బంది అంకితభావంతో కృషి చేస్తే విద్యుత్ సంస్థలను దేశంలో ప్రథమ స్థానంలో నిలపవచ్చని చెప్పారు. సాంకేతికత పూర్తిస్థాయిలో లేని రోజుల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీర్‌గా ఎన్నో అద్భుతాలు చేశారని తెలిపారు. నేటితరం ఇంజనీర్లు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జెన్‌కో ఎండి చక్రధర్ బాబు మాట్లాడుతూ విద్యుత్ రంగం అభివృద్ధిలో విద్యుత్ సంస్థల ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. వారి నిరంతర కృషితో విద్యుత్ సంస్థలు అవసరమైన విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి ప్రసారం, పంపిణీ చేయగలుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో విజిలెన్స్ జెఎండి బి మల్లారెడ్డి, డైరెక్టర్లు ఏవికె భాస్కర్, టి వీరభద్రరెడ్డి, జెన్‌కో డైరెక్టర్లు చంద్రశేఖర్ రాజు, బి వెంకటేశులు రెడ్డి, ఆంటోని రాజా, ఎంవివి సత్యనారాయణ, సయ్యద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

తల్లిని కడతేర్చిన కసాయి

ప్రజాశక్తి-రామభద్రపురం (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా రామభద్రపురం మండల కేంద్రంలో శుక్రవారం దారుణం చోటుచేసుకుంది. మద్యానికి బానిసైన కుమారుడు తన తల్లిని అతి కిరాతకంగా హింసించి హతమార్చాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామభద్రపురంలోని వసంతుల వీధికి చెందిన ఉప్పల రమణమ్మ (78)కు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారులలో ఒకరు చనిపోగా ఇద్దరు కుమారులకు, కుమార్తెలకు వివాహాలు అయ్యాయి. మూడో కుమారుడు ఉప్పల శ్రీను (45) చిన్నతనం నుంచి వ్యసనాలకు బానిసయ్యాడు. నిత్యం మద్యం తాగుతూ తల్లిని వేధించేవాడు. చెడు తిరుగుళ్ళు మానుకొని ఏదైనా పని చేసుకోవాలని తల్లి నిత్యం మందలిస్తుండేది. అయినా ఆయనలో మార్పు లేదు. తల్లికి వచ్చే వృద్ధాప్య పింఛను డబ్బులు కూడా కాజేసి మద్యం తాగేవాడు. గురువారం రాత్రి కూడా పూటుగా మద్యం సేవించి రావడంతో తల్లి మందలించింది. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి, పేగు బంధాన్ని మరిచి తల్లిపై దాడికి పాల్పడ్డాడు. ఆమె నాలుక కోసి, సుత్తితో పలు దఫాలుగా మోది హత్య చేశాడు. మరుసటి రోజు ఉదయం కోసిన నాలుకను తీసుకొని స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు.

బీమాలో మళ్లీ ప్రైవేటు కంపెనీలు

మొదటి పేజీ తరువాయి

పంటలు నష్టపోయాయి. ఇప్పటి వరకు బీమా పరిష్కారం కాలేదు. నిరుడు ఖరీఫ్‌లో ప్రైవేటు కంపెనీలు దిగుబడి ఆధారిత బీమాను అమలు చేయగా రైతుల తరపున ప్రభుత్వాల నుంచి రూ.1,882 కోట్ల ప్రీమియం వసూలు చేసి, రూ.572 కోట్ల పరిహారం చెల్లించడానికి ముందుకొచ్చాయి. ఇంకా రైతులకు పరిహారం పూర్తిగా చేరలేదు. రూ.1,310 కోట్లు మిగుల్చుకోగా అందులో ప్రైవేటు వాటా రూ.780 కోట్లు. గుంటూరు, అన్నమయ్య, విశాఖ జిల్లాల్లో సున్నా క్లెయిములు నమోదయ్యాయి. ఇక్కడ ప్రైవేటు కంపెనీలే నిర్వహించాయి. రైతులు ప్రైవేటు సంస్థలొద్దంటున్నా రాష్ట్ర సర్కారు కేంద్ర పథకాల్లో చేరి క్రాప్ ఇన్సూరెన్స్ వ్యవస్థను మరింతగా ప్రైవేటీకరిస్తోంది.

దిగుబడి ఆధారిత బీమా

క్లస్టర్ సంఖ్య	జిల్లాలు	సగటు ప్రీమియం %	కంపెనీలు
1	పకాశం	5.49	బజాజ్ ఎలియాంజ్
2	అనకాపల్లి అన్నమయ్య, ఏలూరు కోనసీమ, పల్నాడు, సత్యసాయి, తిరుపతి	2.54	ఓరియంటల్
3	అనంతపురం	8.75	ఎస్‌బిఐ
4	అల్లూరి, ఎన్‌టిఆర్, శ్రీకాకుళం	2.83	ఓరియంటల్
5	బాపట్ల, నంద్యాల, మన్యం, విశాఖ	2.14	ఎస్‌బిఐ
6	చిత్తూరు, కర్నూలు, నెల్లూరు, విజయనగరం	2.09	ఎస్‌బిఐ
7	తూర్పుగోదావరి, కృష్ణా, పశ్చిమగోదావరి	1.93	బజాజ్ ఎలియాంజ్
8	వైఎస్ఆర్	9.10	హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో
9	గుంటూరు, కాకినాడ	2.89	ఓరియంటల్

వాతావరణ బీమా

క్లస్టర్ సంఖ్య	జిల్లాలు	సగటు ప్రీమియం %	కంపెనీ
1	అనకాపల్లి, బాపట్ల, ఏలూరు, కాకినాడ, మన్యం, వైఎస్ఆర్	12.50	యూనివర్సల్ సొంపో
2	అనంతపురం	10.47	బజాజ్ ఎలియాంజ్
3	కర్నూలు	7.31	బజాజ్ ఎలియాంజ్
4	నెల్లూరు, సత్యసాయి	12.56	హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో
5	అల్లూరి, అన్నమయ్య, కోనసీమ, పల్నాడు, శ్రీకాకుళం	9.95	బజాజ్ ఎలియాంజ్
6	చిత్తూరు, తూర్పుగోదావరి, గుంటూరు, నంద్యాల, తిరుపతి, విజయనగరం, ఎన్‌టిఆర్, ప్రకాశం	12.01	హెచ్‌డిఎఫ్‌సి ఎర్గో

సిబిఎస్ఇలో 2025 టెన్త్ పరీక్షలు

- విద్యాశాఖ మంత్రి బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సిబిఎస్ఇ విధానంలో 2025 పదో తరగతి పరీక్షలు రాయనున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. సిబిఎస్ఇ సిలబస్ పరీక్షా విధానం అనుసంధానించే దిశలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీనికి తమవంతు కృషి చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలను కోరారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో శుక్రవారం సిబిఎస్ఇ అమలు విధానాలపై సమీక్ష నిర్వహించారు. సిబిఎస్ఇ పరీక్ష విధానం, అకడమిక్ క్యాలెండర్ (వేసవి సెలవులు), లాంగ్వేజీల ఎంపిక తదితర అంశాలను నవోదయ, కేంద్రీయ విద్యాలయాల యాజమాన్యాలతో కూడా చర్చిస్తామన్నారు. అన్నీ పరిశీలించిన తరువాతే తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. 1 నుంచి 12వ తరగతి వరకు ఐబి కరికులమ్ దశలవారీ అమలు పరిచే యోచనలో ఉన్నామని మంత్రి చెప్పారు. 8వ తరగతి నుంచి ప్లస్2 వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు పిజిటి గ్రేడ్, ప్లస్ 2 స్కూల్ హెచ్‌ఎంలకు ప్రిన్సిపల్స్‌గా హోదా మార్పునకు సిఎం వైఎస్ జగన్ ఆమోదం తెలిపారని అన్నారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు భద్రతపై ఎన్ఎస్‌జి ఆందోళన

- కేంద్ర హోంశాఖకు నివేదిక

ప్రజాశక్తి-యంత్రాంగం

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు సహా ఇతర పరిణామాలపై ఎన్ఎస్‌జి కేంద్ర హోంశాఖకు నివేదిక అందించింది. సెప్టెంబరు 8వ తేదీ అర్ధరాత్రి నుంచి 10వ తేదీ అర్ధరాత్రి 1 గంట వరకు నంద్యాల, విజయవాడ, రాజమహేంద్రవరంలో జరిగిన పరిణామాలు, జైల్లో భద్రత తదితర అంశాలను నివేదికలో పేర్కొంది. తొమ్మిదో తేదీ ఉదయం 6 గంటలకు నంద్యాలలో అరెస్టు చేశాక ఎన్ఎస్‌జి రక్షణలో వున్న చంద్రబాబును రోడ్డు మార్గంలో విజయవాడకు తొమ్మిది గంటలపాటు తరలింపు అంశాన్ని వివరించింది. 10వ తేదీ తెల్లవారుజాము 3:30 గంటల నుంచి సిట్ కార్యాలయం నుంచి విజయవాడలోని జిజిహెచ్‌కు ఆ తర్వాత ఎసిబి కోర్టుకు తరలించిన తీరును వివరించింది. భద్రతా పరంగా అంత పటిష్టంగా లేని ఎసిబి కోర్టు హాలు వెలుపల ఆయన్ను వుంచినట్లు పేర్కొంది. అలాగే అదేరోజు రాత్రి 9:29 నిమిషాలకు వర్షంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారని రిపోర్టులో పేర్కొంది. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ప్రస్తుతం ఆయన భద్రత ఏమిటన్న విషయాన్ని కూడా ఎన్ఎస్‌జి ప్రస్తావించింది. జైలు ఆవరణలోకి వెళ్లే సమయంలో కొన్ని భద్రతా లోపాలు గుర్తించినట్లు పేర్కొంది. మొత్తం నివేదికను చంద్రబాబు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎన్ఎస్‌జి సిబ్బంది ఎన్ఎస్‌జి ప్రధాన కార్యాలయం తోపాటు కేంద్ర హోంశాఖకు నివేదికను అందజేసింది.

ములాఖత్‌కు భువనేశ్వరి దరఖాస్తు తిరస్కరణ

చంద్రబాబును కలిసేందుకు ఆయన భార్య భువనేశ్వరి ములాఖత్ కోసం పెట్టుకున్న దరఖాస్తును శుక్రవారం తిరస్కరించారు. రిమాండ్ ఖైదీని న్యాయవాది మినహా మిగిలిన వారు కలుసుకునేందుకు వారంలో రెండు ములాఖత్‌లకు మాత్రమే వీలుంది. న్యాయవాదులకూ కొన్ని నిబంధనల మేరకే ప్రత్యేక ములాఖత్‌లు ఉంటాయి. చంద్రబాబు కుటుంబ సభ్యులు ఈ నెల 11న లోకేష్, బ్రాహ్మణి, భువనేశ్వరి ములాఖత్ తీసుకున్నారు. 15న లోకేష్, పవన్‌కల్యాణ్, బాలకృష్ణ ములాఖత్ అయ్యారు. నిబంధనల ప్రకారం రెండు ములాఖత్‌లు అయిపోవడంతో భువనేశ్వరి దరఖాస్తును జైలు అధికారులు తిరస్కరించినట్లు సమాచారం. రెండు ములాఖత్‌లు ముగిసిపోతే తరువాత ములాఖత్ ఇచ్చేది లేనిదీ పూర్తిగా జైలు సూపరింటెండెంట్ పరిధిలో ఉంటుంది. వ్యక్తిగత కారణాల రీత్యా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ 3 రోజులు సెలవులో ఉన్నారు. ప్రస్తుతం జైళ్ల శాఖ డిఐజి రవికిరణ్ పర్యవేక్షణ చేస్తున్నారు.

స్కిల్ వ్యవహారాలపై వెబ్‌సైట్

- టిడిపి నేతల ఆవిష్కరణ
- మంత్రివర్గ ఆమోదంతోనే నాటి ఒప్పందాలు


వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో ఏం జరిగిందో ప్రపంచ వ్యాప్తంగా తెలియాలనే అన్ని ఆధారాలతో కూడిన వాస్తవాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. అందుకే దీనికోసం apskilldevelopmenttruth.com వెబ్‌సైట్‌లో అవినీతి లేదని నిరూపించే వాస్తవాలను ప్రతిరోజూ ప్రజల ముందు ఉంచుతామన్నారు. టిడిపి కార్యాలయంలో వెబ్‌సైట్‌ను పార్టీ సీనియర్ నేతలతో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మంత్రివర్గ ఆమోదంతోనే జరిగిందని, ఇందుకు సంబంధించిన తీర్మానాలు, ఇతర జిఓలన్నీ వెబ్‌సైట్‌లో ఉంచామని చెప్పారు. ప్రాజెక్టు ఏర్పాటు వెనకున్న అవశ్యకత మొదలు మొత్తం ప్రాజెక్టు అమలైన తీరు, దానివల్ల లబ్ధిపొందిన వారి వివరాలన్నీ పొందుపరిచామని చెప్పారు. రాష్ట్రంలో 2,17,500 మంది యువత శిక్షణ పొందితే వీరిలో 70 వేల మందికి ఉపాధి, ఉద్యోగాలు లభించాయని వివరించారు. తమ ప్రభుత్వంలో సమర్ధవంతంగా ప్రాజెక్టు అమలు చేసినందుకు వచ్చిన అవార్డును వైసిపి ప్రభుత్వం స్వీకరించి తానే అంతా చేసినట్టు చెప్పుకుందని విమర్శించారు. శిక్షణ కేంద్రాలు పరిశీలించకుండా టిడిపి నేతల్ని అడ్డుకుంటున్నారని, కళాశాల యాజమాన్యాలను బెదిరించి తాళాలు ఎందుకు వేయిస్తున్నారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, నిమ్మల రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్పందించకపోవడాన్ని ఎన్‌టిఆర్‌నే అడగాలి : అచ్చెన్నాయుడు

చంద్రబాబు అరెస్టుపై స్పందించకపోవడాన్ని జూనియర్ ఎన్‌టిఆర్‌నే అడగాలని అచ్చెన్నాయుడు విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పార్టీలో ఉన్నారో, లేదో కూడా ఎన్‌టిఆరే సమాధానం చెప్పాలని అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ.. ప్రజలు స్వచ్ఛంధంగా ఆందోళనలు నిర్వహిస్తున్నారని, హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నిరసన తెలిపారని, ఇలా ఎప్పుడూ జరగలేదన్నారు. విజయవాడలో కూడా స్వచ్ఛంధంగా నిరసన వ్యక్తం చేశారని చెప్పారు.

నా పేరుతో తప్పుడు ప్రచారం

తన పేరుతో తప్పుడు లేఖను విడుదల చేశారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు వెల్లడించారు. పార్టీ అనుబంధ విభాగాలను హెచ్చరిస్తూ తప్పుడు లేఖను వైసిపి సోషల్ మీడియా విభాగం తప్పుడు ప్రచారానికి తెరలేపిందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడకు మద్దతుగా వేలాదిమంది స్వచ్ఛంధంగా పాల్గొంటున్న నిరసన కార్యక్రమాలు చూసి ఓర్వలేక పార్టీ కేడర్‌ను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని, దీనిని ఎవరూ నమ్మొద్దని కోరారు.

కోర్టులను తప్పుదోవ పట్టించిన సిఐడి : పయ్యావుల

కోర్టులను సైతం సిఐడి తప్పుదోవ పట్టించిందని టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ విమర్శించారు. చంద్రబాబుపై సిఐడి డిజి సంజయ్, అసిస్టెంట్ అడ్వకేట్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి విపరీతమైన అసత్యాలు వల్లెవేశారని టిడిపి కార్యాలయంలో విలేకరులతో అన్నారు. సీమెన్స్ ఇండస్ట్రియల్ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనేక దేశాల్లో ఉందన్నారు. ఈ కంపెనీకి సీమెన్స్‌కు సంబంధం లేదని ఎలా చెప్పగలరని ప్రశ్నించారు. సీమెన్స్ సంస్థ పేరు వేరేవారు వాడుకుంటే ఆ సంస్థ చూస్తూ ఊరుకుంటుందా? అని అన్నారు. సీమెన్స్ ఎజి లేఖ రాసిందని తప్పుడు సమాచారం ఇస్తున్నారని, ఆ లేఖను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి, సంజయ్, పొన్నవోలు సుధాకర్ రెడ్డి మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

జనాభాకు అనుగుణంగా ఓటర్ల పెరుగుదల లేదు

- సిఇసి ముఖేష్‌కుమార్ మీనాకు వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఓటర్ల పెరుగుదల నమోదు కావడం లేదని, ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ విచారణ జరపాలని వైసిపి కోరింది. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలోని సిఇసి కార్యాలయంలో సిఇసి ముఖేష్‌కుమార్ మీనాకు మాజీ మంత్రి పేర్ని నాని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు, 2019 నుంచి 2023 వరకు నమోదైన ఓటర్ల సంఖ్య హెచ్చుతగ్గులకు సంబంధించి అంశాలను ఫిర్యాదులో ప్రస్తావించారు. 2014 నుంచి 2019 వరకూ 30,08,032 ఓట్లు వుంటే, 2019 నుంచి 2023 కాలంలో 38 వేల ఓట్లు తగ్గాయని తెలిపారు. అలాగే ఓటర్ల వృద్ధి 2014-19 మధ్య కాలంలో 8.1 శాతం మేర నమోదైతే 2019 నుంచి 2023 మధ్య 0.09 శాతం క్షీణత నమోదైందని వివరించారు. గతేడాది కంటే 2023 సంవత్సరంలో నికర ఓట్ల సంఖ్య తగ్గిందన్నారు. దీనిని బట్టి నకిలీ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోందన్నారు. 2019 ఓటర్ల జాబితా నుండి నకిలీ ఓట్లను తొలగించే అంశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. జనాబా పెరుగుతున్నప్పుడు ఓటర్ల సంఖ్య కూడా పెరగాలని అన్నారు. నకిలీ ఓట్ల విషయంపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

గ్యారంటీలకు పరిమితి

- రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గ్యారంటీలకు సంబంధించి ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ రూపొందించిన ప్రతిపాదనల్లో కొన్నింటికి ఆమోదం తెలుపుతూ రాష్ట్ర ఆర్థికశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రిజర్వ్‌బ్యాంకుకు లేఖ రాసారు. గతేడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు తీసుకునే రుణాలకు ఇచ్చే గ్యారంటీలపై పరిమితి విధించాలన్న చర్చ సాగుతోంది. దీనిలో భాగంగా ఔట్‌స్టాండింగ్ గ్యారంటీలకు పరిమితిని వార్షిక ఆదాయంలో ఐదు శాతానికి ఖరారుచేయాలని, లేదా జిఎస్‌డిపిలో 0.5 శాతానికి పరిమితి విధించాలని గత చర్చల్లో భావించారు. ఇందులో ఏది తక్కువగా ఉంటే దానిని అమలు చేయాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు రాష్ట్రం అంగీకరించింది. అలాగే కాంపోజిట్ సీలింగ్ అమలుపై గతంలో తీసుకున్న ప్రాథమిక నిర్ణయాన్ని ఉపసంహరించుకునే సిఫార్సుపైనా రాష్ట్రం అంగీకారం తెలిపింది. ఇచ్చిన గ్యారంటీలపై వసూలు చేసే రుసుమును కూడా 0.25 శాతంగా ఖరారు చేసిన అంశానికి కూడా ఆమోదం తెలిపారు.

కడప మాజీ కమిషనరుకు జైలు శిక్ష

ప్రజాశక్తి-అమరావతి

కడప మున్సిపల్ మాజీ కమిషనరు, శ్రీశైలం ఆలయ ఇఒ లవన్నకు నెలరోజుల సాధారణ జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. కోర్టు ధిక్కరణ కేసులో వెలువరించిన ఈ తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు రెండు వారాల గడువు ఇచ్చింది. అప్పటి వరకు తీర్పు అమలును నిలిపేస్తున్నట్లు జస్టిస్ ఎస్ సత్తిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన ఇల్లు, షాపుల్ని కూల్చివేత చర్యలు తీసుకుంటున్నారంటూ కడప హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన పద్మావతి బాయ్ 2020 జులైలో కేసు వేశారు. చట్ట నిబంధనలకు అనుగుణంగా చేయాలన్న ఉత్తర్వుల్ని కమిషనరు ఉల్లంఘించారని కోర్టు ధిక్కార వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. కోర్టు ఉత్తర్వుల ప్రతిని చించేశారని, పిటిషనరును పోలీసులు లాక్కెళ్లిన ఫొటోలు కూడా ఉన్నాయని ఆమె తరపున న్యాయవాది చూపించారు. వీటిని పరిశీలించిన తర్వాత నాటి కమిషనరుకు జైలు శిక్ష, జరిమానాను విధిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది.

మళ్లీ అగ్రిగోల్డ్ పోరు

(మొదటి పేజీ తరువాయి)

కోట్లు ఇప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి వున్న ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు.

అరెస్ట్‌లు తగవు : కె రామకృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోమని కోరితే నిర్బంధాన్ని ప్రయోగించి అరెస్ట్‌లు చేయడం సరికాదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పేర్కొన్నారు. మార్గదర్శి మీద వున్న ఫోకస్ అగ్రిగోల్డ్ మీద ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.

ప్రభుత్వం విఫలం : సిహెచ్ బాబురావు

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్ బాబురావు అన్నారు. తమది పేదల ప్రభుత్వం అని పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బాధితుల పక్షాన కాకుండా అగ్రిగోల్డ్‌కు ఎందుకు వత్తాసు పలుకుతున్నారని ప్రశ్నించారు.

మేనిఫెస్టోలో ఉన్నా అమలు చేయరా: ఎన్ తులసిరెడ్డి

జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాదితులకు న్యాయం చేస్తానని పేర్కొన్నారని, దానిని అమలు చేయాలని కోరినా అరెస్ట్‌లకు దిగడం సబబు కాదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత తులసిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం అగ్రిగోల్డ్ ఆస్తులను స్వాదీనం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

కార్మికుల సంక్షేమం కోసమే వెల్ఫేర్ బోర్డు

- సిడబ్ల్యుఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబు

ప్రజాశక్తి-నెల్లూరు

అసంఘటిత, భవన నిర్మాణ రంగం కార్మికుల సంక్షేమం కోసం పోరాటం చేసి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యాక్టును సాధించుకున్నామని, ఈ యాక్టును అనుసరించి పలు రాష్ట్రాల్లో వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేశారని సిడబ్ల్యుఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు తెలిపారు. నెల్లూరు నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న సిడబ్ల్యుఎఫ్ఐ జాతీయ సమావేశాల్లో భాగంగా శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో వ్యవసాయ రంగం తరువాత అతి పెద్ద రంగం భవన నిర్మాణరంగమని తెలిపారు. ఈ నిర్మాణ రంగంలో రిజిష్టర్ అయిన కార్మికుల సంఖ్య 5 కోట్లకు పైగా ఉన్నారని తెలిపారు. రిజిష్టర్ కాకుండా అనేక ప్రాంతాల్లో పనిచేస్తున్న భవన నిర్మాణ రంగం కార్మికులు, వ్యవసాయ రంగం కుంటుపడిన తరువాత పట్టణ ప్రాంతాలకు వలస వెళ్తున్న కార్మికులు, ఉపాధి కోసం ఒక ప్రాంతం నుంచి మరోక ప్రాంతానికి వెళ్తున్న కార్మికులను కలుపుకుంటే దాదాపు 8 కోట్ల మంది కార్మికులు నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. 14 శాతం జిడిపి నిర్మాణ రంగం నుంచి ప్రభుత్వ ఖజానాకు వస్తుందన్నారు. అటువంటి రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత లేదని, కనీసం నెలలో 30 రోజులకు పని దొరుకుతుందన్న భరోసా లేదని తెలిపారు. వెల్ఫేర్ బోర్డుపై ప్రభుత్వ పెత్తనం ఎక్కువైపోయిందన్నారు. కార్మికుల సంక్షేమాన్ని కేంద్రం గాలికి వదిలేసిందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెరగడంలేదని, ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే అతని కుటుంబానికి ఎటువంటి రక్షణ లేదన్నారు. ఈ విధానాలన్నింటిపైనా కార్మికులు పోరాడాల్సిన అవసం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ పెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు పెంచాలి

- సిఎస్‌కు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన ప్రతి సంవత్సరమూ జీతాలు పెంచాలని, ఆప్కాస్ కార్పొరేషన్‌లో లేని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఆప్కాస్‌లో చేర్చాలని ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిఎస్ జవహర్‌రెడ్డిని శుక్రవారం సచివాలయంలో ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం వినతిపత్రం అందజేసింది. అనంతరం బొప్పరాజు మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సిఎస్‌ను కలిసిన వారిలో ఎపి జెఎసి నాయకులు పలిశెట్టి దామోదరరావు, వివి మురళీకృష్ణమనాయుడు ఉన్నారు.

తెలంగాణ సమగ్రశిక్ష, కెజివిబి పోరాటానికి మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష, కెజిబివి కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జెఎసి సంపూర్ణ మద్దతు తెలిపింది. ఈ మేరకు నాయకులు ఎం బాలకాశి, బి కాంతారావు, కె విజయ్, సిహెచ్ దేవేంద్ర శుక్రవారం ప్రకటన విడుదల చేశారు.

- స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ హోదాతో ఉద్యోగోన్నతి కల్పించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. విజయవాడలో శుక్రవారం మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో అమలు కానున్న సిబిఎస్ఇ సిలబస్ 1100 పాఠశాలల్లో ఇంప్లిమెంట్ చేయడానికి కావాల్సిన విధివిధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఇంటర్ మీడియట్ బోధించే జూనియర్ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కలిగిన ఉద్యోగోన్నతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

టిటిడి రిటైర్డ్ ఉద్యోగులకూ ఇంటి స్థలాలు

- ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో


టిటిడి రిటైర్డ్ ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరించారని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం మరో 200 ఎకరాలు కేటాయిస్తామని, ఏ ఒక్కరినీ అసంతృప్తికి గురిచేసే అవకాశం లేదన్నారు. ఈనెల 18 శ్రీవారి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించేందుకు సిఎం జగన్ విచ్చేస్తారని, ఈ సందర్భంగా తొలుత శ్రీనివాస సేతు ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ఉద్యోగులకు ఇంటి స్థలాలు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం గంగమ్మ ఆలయాన్ని సందర్శిస్తారని చెప్పారు.

ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రూ.650 కోట్లతో నిర్మించిన శ్రీనివాససేతు వంతెనపై ఈ నెల 19 నుంచి వాహనాల రాకపోకలకు అనుమతిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ డాక్టర్ శిరీష, జెఇఒ సదా భార్గవి, కమిషనర్ హరిత, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, కార్పొరేషన్ ఎస్ఇ మోహన్, ఆప్కాన్ సంస్థ మేనేజర్ రంగస్వామి పాల్గొన్నారు.

ఎగుమతుల వెలవెల

- ఆగస్టులో 7 శాతం పతనం
- 10 నెలల గరిష్టానికి వాణిజ్య లోటు

న్యూఢిల్లీ : ప్రపంచ మార్కెట్‌లో భారత సరుకులకు డిమాండ్ పడిపోతోంది. వరుసగా ఏడో మాసంలోనూ ఎగుమతులు డీలా పడ్డాయి. మరోవైపు ఎగుమతుల కంటే దిగుమతులు అధికంగా ఉండటంతో భారత వాణిజ్య లోటు ఎగిసి పడుతోంది. దీంతో అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుత ఏడాది ఆగస్టులో దేశ ఎగుమతులు 7 శాతం పతనమై 34.48 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని శుక్రవారం ప్రభుత్వ గణంకాలు వెల్లడించాయి. గతేడాది ఇదే మాసంలో 37.02 బిలియన్ల ఎగుమతులు జరిగాయి. గడిచిన నెలలో దిగుమతులు 5.23 శాతం తగ్గి 58.64 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకున్నాయి.



ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో దేశ వాణిజ్య లోటు 24.16 బిలియన్ డాలర్లకు ఎగిసింది. దీంతో వాణిజ్య లోటు 10 నెలల గరిష్ఠ స్థాయికి చేరింది. ఈ ఏడాది జులైలోనూ ఎగుమతులు 15.88 శాతం క్షీణించాయి. గడిచిన ఆగస్టులో భారత సరుకులు, సేవల ఎగుమతులు స్థూలంగా 4.2 శాతం తగ్గి 60.87 బిలియన్లుగా నమోదయ్యాయి. ఇదే సమయంలో స్థూల దిగుమతులు 5.97 శాతం తగ్గి 72.50 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు కాలంలో భారత సరుకుల ఎగుమతులు 11.9 శాతం క్షీణించి 172.95 బిలియన్లకు తగ్గగా.. అదే సమయంలో దిగుమతులు 2 శాతం తగ్గి 271.83 బిలియన్లుగా చోటు చేసుకున్నాయి. దీంతో గడిచిన ఐదు మాసాల్లో భారత వాణిజ్య లోటు 98.88 బిలియన్లకు ఎగిసింది. ప్రపంచ దేశాల ఉత్పత్తులతో పోటీ పడలేకపోవడం, గ్లోబల్ డిమాండ్‌లోనూ స్తబ్దత నేపథ్యంలో భారత ఎగుమతులు తగ్గిపోతున్నాయని పరిశ్రమ నిపుణులు పేర్కొంటున్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

1998 డిఎస్‌సిలో అన్యాయం జరిగిన ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగ మహిళలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించి మిగిలిపోయిన 2,326 మందికి వెంటనే ఎంటిఎస్ పద్ధతిలో ఎస్‌జిటి పోస్టులు భర్తీ చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో శుక్రవారం మూడోరోజు రిలే నిరాహార దీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభ్యర్థులకు న్యాయం చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంఘాలనూ కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. డిఎస్‌సి 1998 స్టేట్ జనరల్ సెక్రటరీ ఇ శ్రీనివాసులు మాట్లాడుతూ.. వెంటనే నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలన్నారు. నిరాహార దీక్షలో పులివెందుల రమేష్, మేరీ సుహాసిని పాల్గొన్నారు.

సూర్యనారాయణకు సుప్రీంలో ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎపిజిఇఎ అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ముందస్తు బెయిల్‌కు సంబంధించి హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. విచారణ పూర్తయ్యేంతవరకూ సూర్యనారాయణను అరెస్టు చేయొద్దంటూ సుప్రీం ఆదేశాలు ఇచ్చింది. సూర్యనారాయణ తరపున సుప్రీం కోర్టులో సీనియర్ కౌన్సిల్ సిద్ధార్థ లూథ్రా వాదించారు. తదుపరి విచారణను నవంబరు పదికి ధర్మాసనం వాయిదా వేసింది.

ఇతర రాష్ట్రాల ప్రముఖులకు 'రాష్ట్ర అతిథి' సౌకర్యాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రానికి వచ్చే ప్రముఖులను రాష్ట్ర అతిథి హోదాతో గౌరవించాలని సాధారణ పరిపాలన శాఖ నిర్ణయించింది. ఈ మేరకు అన్ని శాఖలకు సర్క్యులర్లు జారీచేసింది. ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అధికారులు, రాజకీయ ప్రముఖులు, ఇతర రంగాల ప్రముఖులు వస్తుంటారు. అటువంటి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా

'స్వచ్ఛత హీ సేవ' ఉద్యమం

- గంధం చంద్రుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా 'స్వచ్ఛత హీ సేవ' ఉద్యమానికి రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పునరంకితం కానుందని ఆ సంస్థ ఎమ్‌డి గంధం చంద్రుడు అన్నారు. దేశ వ్యాప్తంగా స్వచ్ఛత హీ సేవ పక్షోత్సవ కార్యక్రమం శుక్రవారం ప్రారంభం కాగా విజయవాడలోని స్వచ్ఛాంధ్ర కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రుడు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిర్వహిస్తున్నట్లు వివరించారు. పర్యాటక ప్రదేశాలు, మార్కెట్‌లు, జాతీయ ఉద్యాన వనాలు, అభయారణ్యాలు, చారిత్రక స్మారక చిహ్నాలు, బీచ్‌లు, రివర్ ఫ్రంట్‌లు, ఘాట్‌లు వంటి అధిక జనసంచారం ఉన్న ప్రదేశాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గంధం చంద్రుడు పేర్కొన్నారు. ఈ నెల 17న ప్రత్యేక ర్యాలీ నిర్వహిస్తామని, మరోవైపు రాష్ట్రంలోని పారిశుధ్య కార్మికులందరికీ 17 నుంచి 25 వరకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


పేదలు, సిపిఎం నాయకులతో చర్చలు జరుపుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

దిగొచ్చిన యంత్రాంగం..!

- వారం రోజుల్లో పట్టాలు ఇస్తామని హామీ
- కోడూరులో భూపోరాటం తాత్కాలిక విరమణ

ప్రజాశక్తి - చిలమత్తూరు (సత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కోడూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 805లో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పేదలు చేపట్టిన భూ స్వాధీన పోరాటంతో అధికారులు దిగొచ్చారు. వారం రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి పోరాటం కొనసాగిస్తున్నారు. పేదలను ఆ భూముల నుంచి వెళ్లగొట్టాలన్న ఉద్దేశంతో పోలీసులతో అధికారులు బెదిరించే ప్రయత్నం చేశారు. సిపిఎం శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి ఇంతియాజ్‌తో పాటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వెంకటేష్, రామచంద్ర, లక్ష్మినారాయణ తదితరులను అరెస్టు చేసి వాహనంలో తరలిస్తుండగా పోలీసు జీపును మహిళలు చుట్టుముట్టి అడ్డుకున్నారు. మహిళలను పక్కకు నెట్టేసి చిలమత్తూరు పోలీసు స్టేషన్‌కు వారిని తరలించారు. అరెస్టు చేసే క్రమంలో పోలీసులు, మహిళలకు మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో ఓ మహిళ ఊపిరాడక స్పృతప్పి పడిపోయారు. అరెస్టు అనంతరం కూడా వెనక్కి తగ్గకపోవడంతో పేదలు, సిపిఎం నాయకులతో తహశీల్దార్ చర్చలు జరిపారు. వారం రోజుల్లో ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. తహశీల్దార్ హామీతో పోరాటాన్ని తాత్కాలికంగా విరమించారు. రెవెన్యూ అధికారులు ఇచ్చిన హామీ మేరకు ఈ నెల 21 తేదీలోపు పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో మళ్లీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేశారు.

సచివాలయ ఉద్యోగులపై నిఘా

- ఆర్థిక అవకతవకల పేరిట ఇద్దరి సస్పెన్షన్
- మరో 25 మందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టింది. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారంటూ ఇద్దరిని ఇప్పటికే సస్పెండ్ చేయగా, మరో 25 మందికి తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీంతో సచివాలయ ఉద్యోగుల్లో కలకలం రేగుతోంది. సచివాలయాల ద్వారా ప్రజలకు పౌరసేవలు అందిస్తుండటంతో పెద్ద మొత్తంలో సర్వీస్‌ఛార్జీ వసూలవుతోంది. అయితే, ఈ మొత్తాన్ని ప్రభుత్వానికి జమచేయకుండా కొందరు ఉద్యోగులు సొంతానికి వాడుకుంటున్నారని అధికారులు అంటున్నారు. తాము జమచేసినా సాంకేతిక కారణాలతో డిస్‌ప్లే కొంత ఆలస్యంగా కనబడుతోందని, ఇందులో తమ తప్పేమీ లేదని ఉద్యోగులు అంటున్నారు. మరోవైపు అధికారులు తమ చర్యలను సమర్థించుకుంటున్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని సంతపేట గ్రామ సచివాలయంలో ఒక కార్యదర్శి ఏడాది కాలంగా ఖజానాకు లక్ష రూపాయలు జమ చేయలేదని, ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేట సచివాలయంలో పనిచేస్తున్న మరో కార్యదర్శి సుమారు రూ.3లక్షల వరకు సొంతానికి వాడుకున్నారని వారు చెబుతున్నారు. దీంతో వీరిద్దరిని సస్పెండ్ చేశామన్నది అధికారులు అంటున్నారు. వీరుగాకుండా మరో 25 మందికి శుక్రవారం నోటీసులు జారీ అయ్యాయి. వీరందరు నిధులు ప్రభుత్వానికి చెల్లించలేదని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని నోటీసుల్లో పేర్కొన్నారు. వాడుకున్న మొత్తాన్ని మూడు రోజుల్లో ప్రభుత్వ సర్వీస్ ఖాతాకు జమ చేయని పక్షంలో ఆయా ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి: ఎన్ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో విధి నిర్వహణ సందర్భంగా నమోదైన కేసులను తక్షణం పరిష్కరించాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. ఎపిఎస్‌ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేశాక ఉద్యోగులకు అప్పీల్ చేసుకునే అవకాశం లేకుండా పోయిందని, దీంతో ఉద్యోగులు ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి వుందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జిఒలు 70, 71 ప్రకారం శిక్షించే యంత్రాంగంతో పాటు ఉద్యోగులకోసం అప్పిలేట్ వ్యవస్థను ఏర్పాటుచేసి సమస్యలను పరిష్కరించాలన్నారు.

సంపాదకీయం

ఎట్టకేలకు సైన్స్ పురస్కారాలు

భారత శాస్త్ర పరిశోధనల రంగంలో నోబెల్ పురస్కారంగా భావించే శాంతి స్వరూప్ భట్నాగర్ (ఎస్ఎస్‌బి) పురస్కారాలను ఏడాది జాప్యం తర్వాత కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు గత సోమవారం నాడు ప్రకటించింది. భట్నాగర్.. భారత పరిశోధన శాలల పితామహునిగా ఖ్యాతినొందారు. ఆయన వ్యవస్థాపకునిగా సేవలందించిన శాస్త్ర, పారిశ్రామిక పరిశోధనల మండలి (సిఎస్ఐఆర్) ప్రతి యేటా 45 సంవత్సరాల లోపు వయస్సున్న యువ శాస్త్రవేత్తలకు ఈ పురస్కారాలను ప్రకటిస్తుంది. ఈ ఏడాది 12 మంది శాస్త్రవేత్తలకు ప్రకటించారు. సాధారణంగా సిఎస్ఐఆర్ వ్యవస్థాపక దినోత్సవం అయిన సెప్టెంబరు 26న ఈ పురస్కారాలు ప్రకటిస్తారు..కానీ గతేడాది ప్రకటించకపోవడం వల్ల ఈ ఏడాది పక్షం రోజులుగా ముందుగానే ఈ నెల 11న పురస్కారాల జాబితా విడుదల చేయడం విశేషం. పురస్కారాలకు ఎంపికైన వారందరికీ అభినందనలు. హైదరాబాద్‌కు చెందిన జీవ శాస్త్రవేత్త మద్దిక సుబ్బారెడ్డి కూడా ఉండటం ముదావహం.

యువ శాస్త్రవేత్తలకు ఆర్థికంగా చేయూతనందించి, శాస్త్ర, సాంకేతిక పరిశోధనలను ప్రోత్సహించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఈ పురస్కారాలకు ఆరున్నర దశాబ్దాల చరిత్ర ఉన్నది. అయితే మోడీ సర్కార్ గతేడాది కారణమేదీ లేకుండానే పురస్కారాల ప్రకటనను నిలిపివేసి, శాస్త్ర, సాంకేతిక రంగాల పట్ల నిర్లక్ష్య ధోరణిని చాటుకుంది. అధికారంలోకి వచ్చిననాటి నుంచి శాస్త్ర, సాంకేతిక రంగాలను నిర్వీర్యం చేసే దిశలోనే బిజెపి ప్రభుత్వం చర్యలు కొనసాగాయి. శాస్త్రీయ దృక్పథాన్ని, భావాల వ్యాప్తిని అడ్డుకునేందుకు సంఘ్ పరివార్ ఎన్ని అఘాయిత్యాలకు పాల్పడిందో విదితమే. మూఢత్వ భావాలపై తమ రచనలతో యుద్ధాన్ని ప్రకటించిన గౌరీ లంకేష్‌ను, గోవింద్ పన్సారేను, నరేంద్ర దబోల్కర్, ఎంఎం కల్బుర్గి వంటి సామాజిక కార్యకర్తలను బలితీసుకుంది. మరోవైపు ప్రతిష్టాత్మక పరిశోధన సంస్థలను ప్రయివేటుకు అప్పజెబుతూ వాటిని నిర్వీరం చేసే చర్యలను కేంద్రం వేగిరం చేసింది. ఈ క్రమంలోనే ప్రోత్సాహక పురస్కారాలను కుదించింది. వివిధ మంత్రిత్వ శాఖలు అనేకానేక పురస్కారాలు ఇస్తున్నందున శాస్త్ర పురస్కారాలకు తగిన గుర్తింపు లభించడం లేదంటూ విడ్డూర వాదన తెరపైకి తీసుకొచ్చి వాటి స్థానంలో 'నోబెల్' తరహా పెద్ద పురస్కారాన్ని ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు కేంద్రం గొప్పలు చెప్పింది. కానీ ఆ తర్వాత నోరు మెదిపింది లేదు. శాస్త్ర పురస్కారాలకు సమాధి కట్టే పన్నాగామే కేంద్రం ఎత్తుగడ అని నాడు శాస్త్రవేత్తలు వ్యక్తం చేసిన ఆందోళనే నిజమైంది. ఆ క్రమంలోనే గతేడాది భట్నాగర్ పురస్కారాలు ఎగవేశారు. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల సమయం కావడంతో కాస్త ముందుగానే ప్రకటించినట్లు కనిపిస్తోంది. ఇప్పటికే ఆరు దశాబ్దాల పరిశోధనల కృషి ఫలితంగా సిద్ధించిన చంద్రయాన్ 3 సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకునేందుకు మోడీ సర్కార్ ఎంత వెంపర్లాడుతోందో చూస్తున్నాం.

శాస్త్ర పురస్కారాలు అంటే రాత్రికిరాత్రే అదృష్టంతో తలుపుతట్టే అవార్డులు కాదు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలకు జీవం పోయడం, అధునాతన పద్ధతులను మరింత సమున్నత స్థాయికి చేర్చడం ద్వారా సమాజాన్ని శాస్త్రీయ ఆలోచనలతో ప్రగతి వైపు నడిపించే కఠోర పరిశ్రమకు లభించే ప్రోత్సహక గుర్తింపుగా సైన్స్ పురస్కారాలను శాస్త్రవేత్తలు భావిస్తారు. శాంతిస్వరూప్ భట్నాగర్ పురస్కారాలు అటువంటివే. ఒక గొప్ప పురస్కారం ఒకరికిచ్చేసి చేతులు దులిపేసుకోవడం కాదు పురస్కారమంటే. శాస్త్ర, సాంకేతిక రంగాన సాధించిన ప్రతి ప్రగతిలోనూ కఠోర శ్రమకూ గుర్తింపు దక్కడం. అప్పుడే శాస్త్రవేత్తలకు ఊతం లభిస్తుంది. ఈ దఫా శాస్త్ర పురస్కారాలకు ఎంపికైనవారిలో ఒక్కరంటే ఒక మహిళా శాస్త్రవేత్త కూడా లేకపోవడం గమనార్హం. అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)తో సహా అనేక కేంద్ర ప్రభుత్వ పరిశోధన సంస్థల్లో ప్రతిభాశీలురైన మహిళా శాస్త్రవేత్తలకు కొదవ లేదు. ఎంతో మంది ఈ పురస్కారాలకు అర్హులైనవారే. కానీ కేంద్ర ప్రభుత్వం పరిశోధన సంస్థలను ముక్కలు ముక్కలుగా చేసి ప్రయివేటుకు కట్టబెడుతోంది. ప్రోత్సహకాలను కుదించేసింది. ఈ వినాశకర విధానాలకు తెరదించి శాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తే చంద్రయాన్ లాంటి అద్భుతాలెన్నో ఆవిష్కృతమవుతాయి.

మహనీయుల మాట



ఒక రాజకీయవేత్త తరువాతి ఎన్నికల గురించి ఆలోచిస్తాడు. రాజనీతిజ్ఞుడు తరువాతి తరం గురించి ఆలోచన చేస్తాడు.

- జేమ్స్ ఫ్రీమేన్ క్లార్కే
అమెరికా రాజకీయవేత్త.

వ్యాఖ్య

జి-20 మోడీ సొంత ప్రచార కార్యక్రమమే!

ఉక్రెయిన్ యుద్ధంపై నెలకొన్న తీవ్ర అభిప్రాయ భేదాలను దృష్టిలో వుంచుకుంటే, న్యూఢిల్లీలో జరిగిన జి-20 సదస్సు, అన్ని సభ్య దేశాల ఆమోదంతో సంయుక్త డిక్లరేషన్‌ను ఆమోదించడం ఆ సదస్సు సాధించిన విజయంగా చెప్పవచ్చు. 2022 నుండి 2025 వరకు జి-20కి అధ్యక్షత వహించిన, వహించబోతున్న నాలుగు దేశాలు-భారత్, ఇండోనేషియా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాలు చేసిన సంయుక్త కృషి కారణంగానే ఉక్రెయిన్ యుద్ధం గురించి చెబుతున్న 8 పేరాగ్రాఫ్‌లపై విజయవంతంగా చర్చలు జరిగాయి.

ఉక్రెయిన్ యుద్ధంపై గల సెక్షన్‌లో, దురాక్రమణ దారుగా రష్యా గురించి ఎలాంటి ప్రస్తావన లేదు-అమెరికా, పశ్చిమ దేశాలు అంగీకరించిన విషయం ఇది. బ్రిక్స్ శక్తివంతమైన వేదికగా ఎదుగుతున్న సమయంలో, ఒక డిక్లరేషన్‌ను ఆమోదించడంలో విఫలమైతే జి-20 పలచనైపోతుందనే వాస్తవాన్ని గుర్తెరిగి రష్యా దూకుడును ఖండించాలన్న వారి దృఢమైన వైఖరి నుండి వెనక్కి మళ్ళారు. చైనాను ఎదుర్కోడానికి భారత్‌ను కీలకమైన మిత్రదేశంగా బైడెన్ చూస్తున్నారు. అందువల్ల నరేంద్ర మోడీ, భారత్ రెండూ జి-20 సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు పొందేలా చూడాలని అమెరికా చాలా ఆసక్తిగా వుండడం ఇందుకు మరో కారణమని చెప్పవచ్చు.

అంతర్జాతీయ ఆర్థిక అంశాలపై చర్చించే వేదికగా జి-20 మొదలైంది. ఆగ్నేయాసియా ఆర్థిక సంక్షోభం తర్వాత 1999లో ఇది ఏర్పడింది. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణల పంథాను అనుసరించడం వల్ల తలెత్తిన సంక్షోభ భారాన్ని పంచుకునేందుకు వర్ధమాన దేశాలను కూడా కలుపుకోవాలని సంపన్న దేశాలు భావించడంతో జి-7 కాస్తా జి-20గా విస్తరించింది. 2008లో అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం నెలకొన్న నేపథ్యంలో అప్పటివరకు మంత్రిత్వ స్థాయిలో జరిగే వార్షిక సంప్రదింపులను ప్రభుత్వాధి నేతల సదస్సుగా మార్చారు. జి-20 అధ్యక్ష బాధ్యతలు సభ్య దేశాల మధ్య ప్రతి ఏటా మారుతూ వుంటాయి.

జి-20 వార్షిక సదస్సు పలు అంశాలను చర్చించి, ఒక డిక్లరేషన్‌ను ఆమోదిస్తుందని అనుభవం తెలియచేస్తోంది కానీ, సభ్య దేశాలన్నీ అమలు చేయగలిగేలా నిర్ణయాలు తీసుకునే సంస్థ కాదిది. జి-20 సదస్సులనేవి ఒక రొటీన్ వ్యవహారంగా మారిపోయాయి. ఈ సదస్సుల్లో ఆర్థికాంశాలు చర్చిస్తారు, కొన్ని ప్రతినలు కూడా చేస్తారు, కానీ వాటి అమలుకు కట్టుబడి వుండడంగానీ లేదా పర్యవేక్షించడంగానీ వుండదు.

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఉధృతమయ్యాయి. ఇది సరికొత్త ప్రచ్ఛన్న యుద్ధానికి దారి తీసింది. ఈ ప్రచ్ఛన్న యుద్ధంలో అమెరికా, దాని మిత్రపక్షాలు ఒకవైపు. చైనా-రష్యా మరోవైపు నిలిచాయి. గతేడాది బాలి సదస్సులో ఎజెండా లోకి ఉక్రెయిన్ యుద్ధాన్ని తీసుకురావడానికి జి-7 దేశాలు పట్టుబట్టాయి. కానీ దానివల్ల చీలికలు ఏర్పడ్డాయి. చివరకు సంయుక్త డిక్లరేషన్‌ను వెలువరించే సాంప్రదాయాన్ని కూడా గందరగోళంలో పడేసింది.



"సదస్సు సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన బ్రహ్మాండమైన కటౌట్లతో సహా ప్రచారార్భాటమంతా కూడా మోడీని అంతర్జాతీయ వేదికపై ముఖ్యమైన వ్యక్తిగా చూపించే యత్నం చేశారు. ఈ సదస్సును కవర్ చేయడానికి వచ్చిన విదేశీ మీడియా వెంటనే దీన్ని గుర్తు పట్టేలానే ఈ వ్యవహారం వుంది. మోడీ తన వ్యక్తిగత పేరు ప్రతిష్టలను పెంచుకోవడానికి, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తన విజయావకాశాలను మెరుగు పరుచుకోవడానికి ఈ సదస్సును దారుణంగా దుర్వినియోగ పరిచారంటూ బ్రిటీష్ వార్తాపత్రిక 'ది అబ్జర్వర్' తన సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. ఏమీ లేకపోయినా మోడీని విశ్వగురుగా చూపించే మరో కార్యక్రమంగా జి-20 సదస్సు మిగిలిపోతుంది."

అంతర్జాతీయ పేద దేశాల వాణిగా జి-20 సదస్సును చూపించాలని నరేంద్ర మోడీ, భారత్ బృందం భావించాయి, అందుకోసం కృషి చేశాయి. అమెరికాతో సన్నిహితమైన వ్యూహాత్మక పొత్తును పెట్టుకుంటున్నప్పటికీ, మారుతున్న ప్రపంచ పరిస్థితులు, పెరుగుతున్న బహుళ ధృవ వైఖరులను దృష్టిలో వుంచుకుంటే, భారత్‌ను అంతర్జాతీయ పేద దేశాల ఛాంపియన్‌గా చూపించుకోవాల్సిన అవసరం వుందని మోడీకి తెలుసు. అయితే, వర్ధమాన దేశాలు, నిరుపేద దేశాలు ఎదుర్కొంటున్న సమకాలీన సమస్యలపై న్యూ ఢిల్లీ డిక్లరేషన్‌లో ఎలాంటి నిర్దిష్టమైన లేదా చెప్పుకోదగ్గ అంశం లేదు. వాతావరణ మార్పులు, ఆ కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనడానికి అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చడం వంటి కీలకమైన అంశంపై కేవలం సాధారణ ప్రకటనలు మాత్రమే వెలువడ్డాయి. వాతావరణ విపత్తులను ఎదుర్కొనడానికి వర్ధమాన దేశాలకు ఈ క్లైమేట్ ఫైనాన్సింగ్ చాలా కీలకం. వాతావరణ మార్పులను ఎదుర్కొనడానికి అవసరమైన ఆర్థిక సాయం కోసం వంద బిలియన్ల డాలర్లను సమీకరించేందుకు పారిస్ సదస్సులో పారిశ్రామిక దేశాలు ఇచ్చిన హామీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వున్న చందంగా వుంది. క్లైమేట్ ఫైనాన్స్‌పై వర్ధమాన, పేద దేశాల డిమాండ్లు ఈ డిక్లరేషన్‌లో ప్రతిబింబించలేదు.

అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెరుగుతున్న రుణ ఇబ్బందులను తగ్గించేందుకు, వారిపై భారాన్ని తొలగించేందుకు ఎలాంటి వాస్తవిక చర్యలు ఇందులో లేవు. అమెరికా నిరంతరాయంగా పెంచుతున్న వడ్డీ రేట్ల వల్ల గత సంవత్సర కాలంలో పేద దేశాల రుణ భారాలు దాదాపు 800 బిలియన్ల డాలర్ల మేర పెరిగిన విషయాన్ని ప్రస్తావించడంలో డిక్లరేషన్ విఫలమైంది. తమ రుణాల చెల్లింపు బాధ్యతల కారణంగా తీవ్రంగా ఇబ్బందులు పాలవుతున్న 60 దేశాలకు రుణాలను రద్దు చేస్తామన్న హామీ కూడా ఆ డిక్లరేషన్ ఇవ్వలేకపోయింది.

ఐక్యరాజ్య సమితి విధించిన 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంపై శీఘ్రగతిన పురోగతిని సాధించాలని డిక్లరేషన్ పిలుపునిచ్చింది. 2015లో వీటిని ప్రారంభించారు. 2030 కల్లా పూర్తి చేయాల్సిన అవసరం వుంది. ఇప్పటి వరకు, 17 లక్ష్యాల అమల్లో కేవలం 12 శాతం పురోగతి మాత్రమే జరిగింది. అయితే వాటిని సాధించేందుకు మరింతగా కృషి చేయాలంటూ దేశాలకు పిలుపివ్వడంతోనే డిక్లరేషన్ సంతృప్తి పడాల్సి వచ్చింది.

ఆఫ్రికన్ యూనియన్‌ను శాశ్వత సభ్య దేశంగా చేర్చుకోవడమొక్కటే జి-20లో పేద దేశాలకు అనుకూలంగా తీసుకున్న ఏకైక సానుకూల చర్యగా వుంది. అయితే సదస్సు వెలుపల ఏం జరిగింది, సదస్సు నేపథ్యంలో ఏం జరిగిందన్నది ఇక్కడ ప్రాధాన్యత గల అంశాలుగా వున్నాయి. సదస్సుకు ముందు రోజు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మోడీతో ద్వైపాక్షిక సమావేశం జరిపారు. జెట్ ఇంజన్లు, సాయుధ డ్రోన్‌లు తదితరాల కొనుగోలు కోసం కిందటిసారి మోడీ అమెరికాలో పర్యటించినపుడు అంగీకారం కుదిరిన రక్షణ ఒప్పందాలను ఖరారు చేసుకోవడానికి బైడెన్ ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. ఇరు దేశాల మధ్య సైనిక సహకారాన్ని మరింతగా పెంచుకోవడంలో అమెరికా నావికాదళం, మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ మధ్య కుదిరిన సెకండ్ మాస్టర్ షిప్ రిపేర్ అగ్రిమెంట్ నిర్ధారణ కూడా వుంది. దీనితో అమెరికా నావికాదళం ఆస్తులు, ఇతర విమానాలు, నౌకల నిర్వహణ, మరమ్మతులకు భారత్ ఒక కేంద్రంగా ఆవిర్భవించింది. అమెరికా కోళ్ళ, వ్యవసాయ ఉత్పత్తులపై ప్రధానమైన కస్టమ్స్ సుంకాలను ఉపసంహరించుకోవడం ద్వారా భారత్, అమెరికాకు రాయితీలు కూడా ఇచ్చింది. యాపిల్స్, బాదం, పప్పులు, అమెరికా నుండి వచ్చే ఇతర వ్యవసాయ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాలను కూడా భారత్ తగ్గించింది.

ఉక్రెయిన్ యుద్ధంపై నీరుగార్చిన నిబంధనలతో సహకరించేలా అమెరికన్లను బుజ్జగించాలని మోడీ భావించారు. అందుకే భారత రైతులను పణంగా పెట్టి అమెరికాకు ఈ రాయితీలను ఇచ్చారు.

భారత్-మధ్య ప్రాచ్యం-యూరప్ ఆర్థిక కారిడార్ (ఐఎంఇసి)ని ఏర్పాటు చేయడంపై ఒప్పందం కుదుర్చుకోవడం ఈ సదస్సు నేపథ్యంలో వెలువడిన రెండో ప్రకటన. ఇది కూడా అమెరికా చొరవతోనే జరిగింది. ఈ కారిడార్‌లో రైలు, సముద్ర మార్గాల అభివృద్ధి కూడా ఇమిడి వుంది. ఈ మార్గాలు భారత్‌ను మధ్య ప్రాచ్యం ద్వారా యూరప్‌కు అనుసంధానిస్తాయి. ఈ మొత్తం ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థికాంశాలు, వివిధ ప్రాజెక్టుల ఫైనాన్సింగ్ వంటి వివరాలు లేవు. చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రతిగా ఐఎంఇసిని తయారు చేయాలన్నది ఇక్కడ అమెరికా ఆలోచన అని వేరే చెప్పనక్కరలేదు.

జి-20 ప్రధాన బహుళార్థ వేదికగా అసమర్ధమైనదిగా ఇప్పటివరకు సాగిన ప్రక్రియ నిరూపించింది. ఎందుకంటే ఇక్కడ జి-7 దేశాలు, వాటి మిత్రపక్షాలే ఆధిపత్యం చెలాయించాయి. అయితే, భారత్ అధ్యక్ష బాధ్యతలకు సంబంధించినంతవరకు చూసినట్లైతే జి-20 సదస్సుకు ఇతర ఉపయోగాలు వున్నాయి. మోడీ నాయకత్వం వల్ల భారత్‌కు చాలా లాభం కలిగిందని ఊదరగొట్టవచ్చని ఈ జి-20 సదస్సును నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం భావించాయి. మోడీ ప్రతిష్టను దేశీయంగా పెంచుకోవాలన్న తాపత్రయంతో పెద్దఎత్తున హంగామా చేశారు. గత ఏడాది కాలంలో జి-20 సమావేశాల కోసం ఏకంగా రూ. 4100 కోట్లకు పైగా ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. జి-20 కోసం చేసిన బడ్జెట్ కేటాయింపులు కేవలం రూ.990 కోట్లుగా వున్నాయి.

సదస్సు సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన బ్రహ్మాండమైన కటౌట్లతో సహా ప్రచారార్భాటమంతా కూడా మోడీని అంతర్జాతీయ వేదికపై ముఖ్యమైన వ్యక్తిగా చూపించే యత్నం చేశారు. ఈ సదస్సును కవర్ చేయడానికి వచ్చిన విదేశీ మీడియా వెంటనే దీన్ని గుర్తు పట్టేలానే ఈ వ్యవహారం వుంది. మోడీ తన వ్యక్తిగత పేరు ప్రతిష్టలను పెంచుకోవడానికి, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తన విజయావకాశాలను మెరుగు పరుచుకోవడానికి ఈ సదస్సును దారుణంగా దుర్వినియోగ పరిచారంటూ బ్రిటీష్ వార్తాపత్రిక 'ది అబ్జర్వర్' తన సంపాదకీయంలో వ్యాఖ్యానించింది. ఏమీ లేకపోయినా మోడీని విశ్వగురుగా చూపించే మరో కార్యక్రమంగా జి-20 సదస్సు మిగిలిపోతుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

విశ్లేషణ

ఇండియా పేరు మార్పు ఎందుకో!



గుమ్మడిదల రంగారావు

సెప్టెంబరు 18 నుంచి ఐదు రోజులు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరిగే విషయం తెలిసిందే. అయితే సెప్టెంబరు 18 అనేది యాదృచ్ఛికం. కాదు. 1949లో సరిగ్గా అదేరోజు రాజ్యాంగ సభ సుదీర్ఘ చర్చ తర్వాత మన దేశం పేరును 'ఇండియా అనగా భారత్' అని రాజ్యాంగం లోని మొదటి అధికరణాన్ని ఆమోదించింది. ఇండియా, అనగా భారత్ రాష్ట్రాల సముదాయం అని చెబుతుంది రాజ్యాంగం లోని మొదటి అధికరణం. సెప్టెంబరు 18న పార్లమెంటును సమావేశపరచటం అంటే 75 ఏళ్ల అనంతరం సరిగ్గా అదేరోజు రాజ్యాంగసభ నిర్ణయాన్ని తిరగరాయాలనేది బిజెపి వ్యూహంగా కనిపిస్తుంది. 'బిజెపి ప్రభుత్వం చెప్పేది ఒకటి. చేసేది మరొకటి' అని అందరికీ తెలుసు. ఒక దేశం ఒక ఎన్నిక, అదే జమిలి ఎన్నికలు నినాదం కొన్నాళ్ళు తెర మరుగై మళ్లీ హఠాత్తుగా తెర మీదకి తేవటం వెనుక ఒక వ్యూహం వున్నట్లు తెలుస్తుంది. ప్రజల దృష్టిని జమిలి ఎన్నికల అంశం మీదకి మరల్చి, ఆ అంశం మీద అందరూ తర్జనభర్జన పడుతుండగా, పెద్దగా చర్చలేకుండా దేశం పేరు ఇండియా బదులు భారత్‌గా మార్చాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తుంది. అందుకే ఈ ప్రక్రియకి సెప్టెంబర్ 18ని ఎంచుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఆరోజు మొదలవటం వెనుక ఆంతర్యం అదే అనిపిస్తుంది.


అయితే, దీనికి అసలు కారణం ప్రతిపక్ష కూటమికి ఇండియా అనే శబ్దం వచ్చే విధమైన పేరు పెట్టటమే అయినా అది పైకి అనకుండా ఇండియా అనే పేరు వలసవాదుల వారసత్వానికి చిహ్నంగా వుందని చెబుతున్నారు ప్రభుత్వ పెద్దలు. ఇది సహేతుకమైన వాదన కాదు. క్రీస్తు పూర్వం గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీసు రాసిన ఇండికా గ్రంథం ఇండియా అనే పేరుకు తొలి ఆధారాల్లో ఒకటి. అంటే ఎన్నో వేల సంవత్సరాల నుంచి ఐరోపాకు మన దేశం ఇండియా అనే తెలుసు. ఇండియా అనేది ఇంగ్లీషు పాలకులు ఇచ్చిన పేరు కాదు. ఇంగ్లీషు వారు మన నేలమీద అడుగు పెట్టక మునుపే వాస్కోడగామా ఇండియాకి సముద్ర మార్గం కోసం బయలుదేరాడు. అంతకు మునుపు కొలంబస్ కూడా అదే పనిమీద బయల్దేరి అమెరికాను కనుగొన్నాడు. వారికి ఇది భారతదేశం అని అస్సలు తెలియదు.

అయితే, పేరు మార్పేనా పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ఎజెండా అనేది చెప్పలేం. ఇప్పటికీ ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకి ఎజెండాను వెల్లడించలేదు. పార్లమెంటును సమావేశపర్చటంలో ప్రభుత్వం అసలు ఉద్దేశం దేశం పేరు ఇండియా బదులు భారత్‌గా మార్చటమనే వార్తలు వినిపిస్తున్నాయి. జి-20 నేతలకు రాష్ట్రపతి ఇచ్చే విందుకు ముద్రించిన ఆహ్వానంలో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా కాకుండా ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని వుండటం, జి-20 సమావేశంలో మన ప్రధాన మంత్రి కూర్చున్నచోట నేమ్‌ప్లేట్ మీద ఇండియా అని కాకుండా భారత్ అని వుండటాన్ని బట్టి...బహుశా అది నిజమే అయి వుండవచ్చు.

దేశం పేరు మార్పు అనేది ఆషామాషీ విషయం కాదు. దేశం పేరు మార్చే ముందు దేశ ప్రజలను అడగరా? పాలకుల ఇష్టాయిష్టాలకే పరిమితమా? కేవలం పార్లమెంటు ఆమోదం పొందితే సరిపోతుందా? అదీ సార్వత్రిక ఎన్నికలు ఆరు నెలల లోపు వుండగా? దేశం పేరు మారితే అధికారపూర్వక పేర్లలో ఇండియా వున్న చోటల్లా దానిస్థానంలో భారత్ ను చేర్చాల్సి వుంటుంది. దేశం పేరు ఇండియా అయినప్పుడు, మనం ఇండియన్స్‌గా చెబుతాము ప్రపంచానికి. దేశం పేరు భారత్ అయితే ప్రజల నేషనాలిటి ఏమి వుండాలి? మన దేశంలోనే వివిధ భాషల్లో పలు విధాలుగా అంటారు. తెలుగులో మనం భారతీయులం అనుకుంటాం. మరి తమిళంలో, మళయాళంలో, కన్నడంలో ఎలా అంటారు? ఇహ దేశం బయట ఏమని చెప్పాలి? భారత్ అనే దేశం పేరుతో పాటు మన నేషనాలిటీకి కూడా ఒక కామన్ పదాన్ని కనిపెట్టాలి. 'భారత్ కా ఆద్మీ' లేక భారత్‌వాలా అంటే సరిపోతుందా? అది ఏ భాషాపదమై వుండాలి? హిందీ మాటైతే సరిపోతుందా? ఇంగ్లీషు లాగ హిందీ కామన్ భాష అన్న స్టేటస్‌కి ఇంకా ఎదగలేదు. మరి తమిళులు హిందీ మాటను ఒప్పుకుంటారా?

అనేక క్లిష్టమైన అంశాలు ఇమిడి వున్నాయి దేశం పేరు మార్పులో. రూ.వేల కోట్ల ధనం ఖర్చు చెయ్యాలి ఈ ప్రక్రియ పూర్తి చెయ్యటానికి. పైగా ఇందుకు దీర్ఘకాలం పడుతుంది. ఇప్పుడున్న పేరుతో ఎంతో గౌరవ ప్రపత్తులు సంపాయించుకున్న సంస్థలు, కొత్త పేరుతో అదే గౌరవ ప్రపత్తులు తిరిగి పొందాలంటే ఎన్నో ఏళ్ల శ్రమించాల్సి వుంటుంది. శ్రమించినా తిరిగి అదే గౌరవం పొందగలరన్న భరోసా ఏదీ లేదు. ఇది ఒక మతిలేని ఆలోచనగా కనిపిస్తుంది దేశ ప్రజలకు. కానీ, ఇది ఎవరి ఆలోచన? రావణాసురుడికి పది తలలు వున్నట్లు, సంఘ్‌పరివార్‌కి గూడా అనేక తలలు వున్నాయి: ఆర్.యస్.యస్, బిజెపి, మోడీ అమిత్ ద్వయం, విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్, సాధువుల సమ్మేళనం, సన్యాసుల మఠం, అదానీ అంబానీ ద్వయం... గ్రాగ్రా అన్నీ సంఘ్ పరివార్ తలలే. ఏ తలలోంచి ఏ 'సనాతన ధర్మపు' ఆలోచన ఉద్భవించునో ఎవరు చెప్పగలరు?

దేశం పేరు భారత్‌గా మార్చినదే తడవుగా సంఘ్ పరివార్ 'భారత్ మాతాకీ జై' అని అరుస్తూ ఇదే దేశభక్తికి నిదర్శనం అనే ప్రమాదం పొంచివుంది. దేశభక్తిని మతపరమైన కోణంలో చూడటంలోని ఔన్నత్యాన్ని అందరూ ప్రశ్నించాలి. అనేక మత విశ్వాసాల ప్రజలు సహజీవనం చేస్తున్న ఈ భూమిని హిందూ మతవాదుల కోణంలోనే చూడడం లౌకికవాదానికి విఘాతమేకాక భిన్నత్వంలో ఏకత్వం అనే సిద్ధాంతాన్నే పెను ప్రమాదంలోకి నెట్టే అపాయాన్ని కొట్టిపారవేయలేం. పరిపాలనకు ప్రాతిపదిక సనాతన ధర్మమా లేక ఆధునిక భావజాలమా అనేది దేశ ప్రజలే తేల్చవలసిన సమయం ఇది.



దేశం పేరు మార్పు అనేది చిన్న విషయం కాదు. కానీ, పార్లమెంటు ఆమోదం పొందకుండానే కొత్త పేరు వాడటం, అదీ అంతర్జాతీయ వేదికల మీద, అంటే ప్రజాస్వామ్య విలువలు రాజ్యాంగ సంప్రదాయాల పట్ల మన పాలకులకు ఏమాత్రం గౌరవం వుందో తెలుపుతుంది. కీలకమైన అంశాల మీద దేశ ప్రజలు ఆలోచించి అవగాహన చేసుకోవటానికి తగినంత సమయం ఇవ్వకుండా వడివడిగా హడావుడిగా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవటం మోడీ ప్రభుత్వ పనితీరు. నోట్ల రద్దు, లాక్‌డౌన్, ఆర్టికల్ 370 రద్దు ఇందుకు మచ్చుతునకలు.

నేడు దేశం అనేక రంగాల్లో ఎన్నో క్లిష్టమైన సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో వాటిని వదిలి దేశం పేరు మార్చటమేంటి? మార్చాల్సింది దేశం పేరునా, దేశ ప్రజల తలరాతనా? ఇదంతా పరిపాలనా వైఫల్యాల నుంచి ప్రజల దష్టి మరల్చడానికేమో అనే సందేహమూ కలుగుతుంది. ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా వ్యవహరిస్తే ఆ ధోరణిని కట్టడి చెయ్యటానికి న్యాయ వ్యవస్థ సిద్ధంగా లేకపోవటం, మీడియా స్వతంత్రంగా వ్యవహరించ లేకపోవటం, మేధావులు అభద్రతా వాతావరణంలో అచేతనంగా వుండటం కారణాలు. ఎన్నికలు ప్రజలకున్న ఒక ఆయుధం. ఈ ఆయుధం ప్రజాస్వామ్యం బలపడేందుకు దోహదపడాలి. మంచి జరుగుతుందని ఆశిద్దాం.

(వ్యాసకర్త లోక్‌సభ సచివాలయంలో మాజీ డైరెక్టర్)

నివాళి



సెప్టెంబర్ 17న కొల్లా వెంకయ్య 25వ వర్ధంతి

తుది వరకూ పేదల పక్షమే

కామ్రేడ్ కొల్లా వెంకయ్య శాసన సభ్యునిగా, శాసన మండలి సభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా, పొగాకు మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికలలో గెలిచిన అరుదైన రైతు నాయకుడు. విశాఖ ఉక్కు ఆందోళనలో ప్రభుత్వ దమనకాండకు నిరసనగా పార్లమెంటును 90 నిముషాలు స్తంభింపచేసి సభ్యత్వాన్ని తృణప్రాయంగా వదిలేశారు. తెలంగాణ సాయుధ పోరాట కాలంలో మైదాన ప్రాంత రీజినల్ కమిటీ కార్యదర్శిగా, శ్రీకాకుళ రైతాంగ పోరాట ప్రాంతానికి ప్రత్యక్షంగా వెళ్ళి వారి వెన్నుతట్టిన నాయకుడు. డిటెన్యూగా, పార్వతీపురం కుట్ర కేసు ముద్దాయిగా పది సంవత్సరాలు జైలులో వున్నా, నాల్గు సంవత్సరాలు రహస్య జీవితం గడిపినా పట్టు వదలలేదు. గ్రామీణ పేద ప్రజల విముక్తి కోసం, భూసంస్కరణల కోసం చివరికంటా పోరాడారు.

పెదనందిపాడు పక్కనేవున్న పుసులూరు గ్రామంలో 1921లో గ్రామ అధికారులు సభ జరిపి తమ పదవుల రాజీనామాకి నిర్ణయించి సహాయ నిరాకరణకు పిలుపునిచ్చారు. ఆ సందర్భంగా జరిగిన శాంతిసేన ఊరేగింపు, బహిరంగ సభలలో పది సంవత్సరాల వయసులోనే వెంకయ్య పాల్గొన్నారు. గుంటూరు ఏసీ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతూనే, 1934 అక్టోబర్‌లో జరిగిన బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా వెళ్లారు. 1936లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పుచ్చుకున్నప్పటి నుండి మరణించే వరకూ వెనక్కి తిరగలేదు. పీడిత ప్రజల విముక్తి కోసం రాజీ లేని పోరాటం కొనసాగించారు.

బాపట్ల తాలూకా కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజర్ పెండ్యాల లోకనాథంతో కలిసి గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘానికి రూపమిచ్చారు. 1939లో జిల్లా రైతు సంఘ అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్న దగ్గర నుండీ 1946లో రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి వరకూ రాష్ట్ర రైతులను సంఘటిత పరిచారు. కాలి నడకన గుంటూరు నుండి పల్నాడు మీదుగా ఒంగోలు ప్రాంత గ్రామాలన్నీ తిరిగేవారమని ఆయన సహచరులు మాదాల నారాయణ స్వామి తెలిపారు. అప్పాపురం ప్రాజెక్టు రైతుల సమస్యలూ, బుంగపోత రైతుల సమస్యలు, ఎరువులు సక్రమ ధరలకు అందించాలనీ రైతులలో ప్రచారం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమం ప్రభావంతో పెదనందిపాడు గ్రామంలో రైతులు, మాదిగలను, మాలలను ప్రోత్సహించి చెరువులో నీరు ముంచుకునేట్లు చేశారు.

భూమి లేని నిరుపేదలకు భూమి హక్కును కల్పించటం కోసం భూసంస్కరణలను అమలు పరచాలని కొల్లా వెంకయ్య అన్ని పోరాట రూపాలనూ ఎంచుకున్నారు. భూసంస్కరణల కోసం సభలు, సమావేశాలు, సదస్సులు, పాదయాత్రలు-ప్రజాందోళన నుండి ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆందోళన, సుప్రీంకోర్టులో రిట్, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, శ్రీకాకుళ రైతాంగ పోరాటం వరకూ పాల్గొన్నారు. జూపూడిలో చర్చి కౌలు భూములపై పోరాటం తీవ్రరూపం దాల్చింది. నర్సాయపాలెంలో గ్రామాధికారులు అక్రమంగా అనుభవిస్తున్న బంజరు భూముల కోసం పోరాటం సాగించారు. ప్రఖ్యాత రొంపేరు బంజరు సత్యాగ్రహం ఆయన నాయకత్వంలో జరిగింది. బళ్లారిలో జైలు శిక్ష అనుభవించారు. పోరాట ఫలితంగా 15 వేల ఎకరాలకు పైగా బంజరు భూమిపై పేదలకు యాజమాన్యం లభించింది. వేలాది ఎకరాల మిగులు భూములను పోరాటాల ద్వారా సాధించుకోగలిగారు. 1973 భూగరిష్ట పరిమితి చట్టం వచ్చినా ఆచరణకు నోచుకోలేదు. చట్టాన్ని అమలు పరచటంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాన్ని చూపించి సుప్రీంకోర్టులో ఆయన ప్రజా ప్రయోజన కేసు వేశారు. చట్టాన్ని అమలు పరచవలసిందిగా సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రజా ఉద్యమాలు బలంగా లేనపుడు ప్రభుత్వాలు, చట్టాలు వున్నవారికి చుట్టాలయ్యాయి. అయినా కొల్లా వెంకయ్య గారు తమ జీవిత చరమాంకంలో కూడా మిగులు భూమి పంపకం కోసం కృషి చేశారు. ప్రజా సమస్యలపై నిరంతర అధ్యయనం, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని అన్వయించి ఆచరించటమే కామ్రేడ్ కొల్లా వెంకయ్యకు నివాళి.

- డా॥ కొల్లా రాజమోహన్,
నల్లమడ రైతు సంఘం, సెల్ : 9000 657799

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

నుహ్ మత ఘర్షణల కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్

చండీగఢ్ : హర్యానాలోని నుహ్ జిల్లాలో చెలరేగిన హింసాకాండ కేసులో ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే మమ్మన్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం అర్ధరాత్రి ఆయనను అదుపులోకి తీసుకున్నామని నుహ్ ఎస్‌పి నరేంద్ర బిజర్నియా శుక్రవారం తెలిపారు. జులై 31న విహెచ్‌పి నిర్వహించిన జలాభిషేక్ యాత్ర సమయంలో నుహ్‌లో జరిగిన మత ఘర్షణల్లో ఆరుగురు మరణించిన సంగతి తెలిసిందే. ఈ అల్లర్లు దక్షిణ హర్యానాలోని కొన్ని ప్రాంతాలకు కూడా విస్తరించాయి. ఈ కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే మమ్మన్ ఖాన్ హస్తం ఉందని హర్యానా పోలీసులు ఆరోపించారు. మమ్మన్ ఖాన్ ప్రస్తుతం ఫిరోజ్‌పూర్ జిర్కా అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తన అరెస్టును ముందే ఊహించిన మమ్మన్ ఖాన్ ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. పంజాబ్- హర్యానా హైకోర్టులో మంగళవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. హింస చెలరేగిన రోజున తాను నుహ్‌లో లేనని, తనను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని మమ్మన్ ఖాన్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్‌పై విచారణ అక్టోబర్ 19న జరగనుంది.

అభిప్రాయాలు చెప్పడమే నేరమా ?

- జర్నలిస్టులపై కేసు ఎలా పెడతారు? • ఎఫ్ఐఆర్‌ను ఎందుకు కొట్టివేయకూడదు? • ఎడిటర్స్ గిల్డ్ కేసులో చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసకు సంబంధించి వక్రపాతంగా మీడియా కవరేజ్ జరిగిందన్న అంశంపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) ఇచ్చిన నివేదిక తప్పు కావచ్చు లేదా నిజం కావచ్చు, కానీ తన అభిప్రాయాలను చెప్పడం భావ ప్రకటనా స్వేచ్ఛ కదా! అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. నలుగురు జర్నలిస్టులపై మణిపూర్ పోలీసులు దాఖలు చేసిన కేసులో వారిపై బలవంతపు చర్యలు తీసుకోకుండా సుప్రీం కోర్టు రెండు వారాల పాటు రక్షణ కల్పించింది. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాకు చెందిన జర్నలిస్టులు నేరానికి పాల్పడ్డారంటూ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని, కానీ అందులో తనకు నేరమేదీ కనిపించడం లేదని చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించారు. అసలు ఆ జర్నలిస్టులు చేసిన నేరమేమిటని ఆయన ప్రశ్నించారు. తమ అభిప్రాయాలను చెప్పడాన్ని నేరంగా ఎలా పరిగణిస్తారు? అని ఫిర్యాదుదారులను ప్రశ్నించారు.


తొలుత ఎఫ్ఐఆర్‌లను ఢిల్లీకి మార్చాలని సూచించిన కోర్టు, ఆ తర్వాత ఫిర్యాదుదారులు పదే పదే జర్నలిస్టులను మణిపూర్‌లో చేసిన నష్టం గురించి ప్రస్తావిస్తూ ఉండడంతో కలకత్తైన వ్యాఖ్యలు చేసింది. "మీరు ఈ విషయాన్ని లేవనెత్తారు కాబట్టి ఒక విషయం ముందు మాకు చెప్పండి, అసలు ఈ నేరాలు ఎలా జరిగాయో చెప్పండి, అఫిడవిట్ దాఖలు చేయండి, అన్నీ రికార్డు చేయండి, అసలు ఈ ఫిర్యాదులను, ఎఫ్ఐఆర్‌లను ఎందుకు కొట్టివేయకూడదో కూడా చెప్పాలి' అంటూ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ కోరారు.

మణిపూర్‌లో వక్రపాతంతో కూడిన మీడియా కవరేజ్ జరిగిందని పేర్కొంటూ ఆర్మీ ఎడిటర్స్ గిల్డ్‌కు లేఖ రాసింది. వెంటనే గిల్డ్ తన సీనియర్ జర్నలిస్టుల బృందాన్ని పంపి, క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో కనుగొనాలంటూ కోరింది. వారు ఒక నివేదికను సమర్పించారు. అది నిజమవ్వచ్చు లేదా తప్పు కూడా కావచ్చు, కానీ అదంతా కూడా భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించినది కదా? మీరు దాన్నెలా తప్పుబడతారని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు. ఒకవేళ మీడియా వార్తలు తప్పు కావచ్చు, జర్నలిస్టులందరిపై ఐపిసిలోని సెక్షన్ 153 కింద అభియోగాలు నమోదు చేస్తారా? అని ప్రశ్నించారు. ఆ నివేదిక అంతా ప్రభుత్వ వ్యతిరేక కథనమని మీరు మీ ఫిర్యాదులో పేర్కొంటున్నారు. ఎడిటర్స్ గిల్డ్ తప్పు చేసిందని మీ భావన, అయితే ప్రతి పేరాగ్రాఫ్‌లో కూడా తప్పు, తప్పు అని పేర్కొంటూ వస్తున్నారు. 'ఒక వ్యాసంలో తప్పుడు స్టేట్‌మెంట్ చేయడం సెక్షన్ 153ఎ కింద నేరం కాదు' అని చీఫ్ జస్టిస్ ఫిర్యాదుదారులకు స్పష్టం చేశారు. ఒక దశలో ఫిర్యాదుదారు తరఫున న్యాయవాది గురుకృష్ణకుమార్ మాట్లాడుతూ, ఎడిటర్స్ గిల్డ్ తన నివేదికను ఉపసంహరించుకుంటే తన క్లయింట్లు కూడా వారి ఫిర్యాదులను ఉపసంహరించుకుంటారని సూచించారు. ఎట్టకేలకు తన ప్రతిస్పందనతో అఫిడవిట్ దాఖలు చేయడానికి ఆయన అంగీకరించారు.

ఎడిటర్స్ గిల్డ్ తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ మాట్లాడుతూ, తమ నివేదికకు వ్యతిరేకంగా వచ్చిన అభిప్రాయాలను కూడా తమ వెబ్ పేజీలో ప్రచురిస్తామని చెప్పారు. రెండు రకాల అభిప్రాయాలు చదివిన తర్వాత ప్రజలు వారి అభిప్రాయాలను ఏర్పరుచుకోవచ్చని అన్నారు.

ఉద్యమ నిర్మాత కనయ్ బెనర్జీ

- సిఐటియు, ఎఐకెఎస్ సంతాపం



న్యూఢిల్లీ : స్వాతంత్య్ర ఉద్యమ నేత, ప్రముఖ కార్మిక సంఘ నాయకుడు, స్వాతంత్య్ర సమరయోధుడు సిఐటియు మాజీ జాతీయ కార్యదర్శి కనయ్ బెనర్జీ మృతికి సిఐటియు, ఎఐకెఎస్ తదితర సంఘాలు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశాయి. 1939లో ఢాకాలో సుభాష్ చంద్రబోస్ ప్రసంగించిన సమావేశానికి హాజరైన విషయాన్ని బెనర్జీ గుర్తు చేసుకునేవారని తెలిపాయి. ప్రజా ఉద్యమాల్లోనూ, రాజకీయ కార్యకలాపాల్లోనూ క్రియాశీలంగా పాల్గొంటున్నందుకు ఆయనను ఇంటి నుండి వెళ్లగొట్టారు. కూచ్‌బిహార్‌లోని కాలేజీ నుండి బహిష్కరించారు. ప్రజల నుంచి వచ్చిన ఒత్తిడితో ఆయన్ని మళ్లీ కళాశాలలోకి తీసుకున్నారు. 1940 తొలినాళ్లలో బీడీ కార్మికులు, బ్రెయిలర్లు, రక్షణ సేవల సంఘాల సంక్షేమం కోసం ఉద్యమాలు నిర్మించిన ఆయన తర్వాత సహకార సంస్థలను నడిపారు. కలకత్తాకు వచ్చిన తర్వాత విద్యార్థి ఉద్యమంలో, కార్మిక సంఘ ఉద్యమంలో చాలా చురుగ్గా వుండేవారు. 1974లో చారిత్రక రైల్వే సమ్మెలో కీలక పాత్ర పోషించారు. 1984లో రైల్వే నుంచి ముందుగానే రిటైర్‌మెంట్ తీసుకుని బిటిఆర్ భవన్ చేరారు. ఢిల్లీలో సిఐటియు సెంటర్‌లో కనయ్ చేరారని సిఐటియు గుర్తు చేసింది. 1989 నుంచి సిఐటియులో వివిధ రంగాల్లో, వివిధ రాష్ట్రాల్లో పలు బాధ్యతలు నిర్వహించారు. సిఐటియు నాయకత్వంలోకి మహిళలను కూడా తీసుకురావాలని ఆయన పట్టుబట్టేవారు. సిఐటియు మైండ్రిప్ రూపకల్పనలో ఆయనది కీలక పాత్ర అని గుర్తు చేసుకుంది. ఆయన మృతికి సంతాపసూచకంగా సిఐటియు, ఎఐకెఎస్ పతాకాలను అవనతం చేశాయి. ఆయన మృతికి సంతాపాన్ని తెలియచేస్తూ వారి కుటుంబ సభ్యులకు ఆయా సంఘాలు సానుభూతిని ప్రకటించాయి.

దార్శనికత కలిగిన కార్మిక సంఘ నేతగా ఆయన పలు రంగాల్లో పనిచేశారని, వర్కింగ్ ఉమెన్స్ ఉద్యమాన్ని అభివృద్ధిపరిచారని ఎఐకెఎస్ పేర్కొంది. రైతులు, కూలీల మధ్య ఐక్యత కోసం ఆయన కృషి చేశారని పేర్కొంది. దేశవ్యాప్తంగా కార్మిక సంఘ ఉద్యమాల నిర్వహణలోనూ, కార్మికులను, రైతులను సమైక్యపరుస్తూ ఆయన సాగించిన ఉద్యమం ఎన్నటికీ గుర్తుండిపోతుందని పేర్కొంది.



'ద్రావిడ మోడల్' పాలనతోనే మహిళలకు గుర్తింపు : స్టాలిన్

- కలైంజర్ మగళిర్ ఉరిమై తిట్టమ్ పథకం ప్రారంభం

కాంచీపురం : 'ద్రావిడ మోడల్' పాలనతోనే మహిళలకు గుర్తింపు లభిస్తుందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) వ్యవస్థాపకులు సిఎన్ అన్నాదురై జయంతి సందర్భంగా కలైంజర్ మగళిర్ ఉరిమై తిట్టమ్ పథకాన్ని కాంచీపురంలో శుక్రవారం స్టాలిన్ ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని సుమారు 1.6 కోట్ల మంది మహిళలకు ప్రతి నెలా హక్కు కింద వెయ్యి రూపాయలు వారి బ్యాంక్ ఖాతాలో వేయనున్నారు. స్టాలిన్ ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించడంతోపాటు, లబ్ధిదారులకు ఎటిఎం కార్డులు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాన్ని ప్రారంభించాలని అనుకున్నా.. అప్పటి ఆర్థిక పరిస్థితి కారణంగా ప్రారంభించలేకపోయామని అన్నారు. డిఎంకెను గెలిపించిన కారణంగానే ఇలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయగలుగుతున్నామని తెలిపారు. ఇప్పటికీ మహిళల విద్యకు అడ్డుపడుతున్న వారిపైనా, నేటికీ బాల్య వివాహాలను అనుసరిస్తున్న వారిపైనా స్టాలిన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కొన్నేళ్లుగా పితృస్వామ్య శక్తుల చేతిలో మహిళలు అణిచివేయబడ్డారని స్టాలిన్ గుర్తు చేశారు. తమిళనాడులోని డిఎంకె ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని చెప్పారు. జి20 సమావేశం సందర్భంగా రాష్ట్రపతి ఇచ్చిన విందుకు హాజరైనప్పుడు కొంతమంది కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమిళనాడు పథకాలు గురించి అడిగారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన అన్ని జిల్లాల్లో ఈ పథకాన్ని మంత్రులు ప్రారంభించారు.

ఒపిఎస్ పునరుద్ధరించాల్సిందే

- డెహ్రాడూన్ చేరుకున్న రథయాత్ర



డెహ్రాడూన్ : పాత పెన్షన్ పథకం (ఒపిఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న రథయాత్ర డెహ్రాడూన్‌కు చేరుకుంది. ఆల్ ఇండియా ప్రైమరీ టీచర్స్ ఫెడరేషన్ (ఎఐపిటిఎఫ్) నేతృత్వంలో సాగుతున్న ఈ రథయాత్రలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, రిటైర్డ్ పెన్షనర్లు, ఇతరులు పాల్గొంటున్నారు. ఎన్‌పిఎస్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్డ్ టీచర్ సుధీర్ ఆర్య మాట్లాడుతూ '2020లో ప్రైమరీ స్కూల్ టీచర్‌గా పదవీ విరమణ చేశాను. నేను ఎన్‌పిఎస్‌లో ఉన్నాను. నెలకు రూ.3 వేలు పింఛను వస్తోంది. ఆ సొమ్ముతో నేనేం చేయగలను' అని ప్రశ్నించారు. డెహ్రాడూన్ చేరుకున్న ఈ రథయాత్రను పంజాబ్‌లోని అట్టారీ వద్ద ప్రారంభించారు. మొత్తంగా దేశంలోని నాలుగు మూలల నుంచి ఈ రథయాత్రను నిర్వహిస్తున్నారు. అట్టారితోపాటు సోమనాథ్, గౌహతి, కన్యాకుమారి నుంచి ఈ రథయాత్రలు ప్రారంభమయ్యాయి. ఈ యాత్రలతో 26 రాష్ట్రాలను కవర్ చేస్తామని, అక్టోబర్ 5కు న్యూఢిల్లీ చేరుకుంటామని అట్టారీ నుంచి ప్రారంభమైన రథయాత్రకు నాయకత్వం వహిస్తున్న డాక్టర్ రామచంద్ర దబాస్ తెలిపారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌కు 26 రాష్ట్రాల నుంచి 30 లక్షల మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల మద్దతు ఉంది. రైల్వే ఫెడరేషన్, సిపిడబ్ల్యూడి, హెల్త్ సర్వీసెస్, పోస్టల్ సర్వీసెస్ మొదలైనవి కూడా మద్దతు ఇచ్చాయి.

'వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన మరో 36 సంస్థలు ఉద్యమానికి మద్దతు ఇస్తున్నాయి. ఆగస్టు 10న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో భారీ ర్యాలీ నిర్వహించాం, ఒపిఎస్‌ను పునరుద్ధరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించాం' అని దబాస్ చెప్పారు. ఎన్‌పిఎస్‌తో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు నెలకు కేవలం రూ.800 నుండి రూ.2,500 వరకు మాత్రమే పెన్షన్ లభిస్తుందని తెలిపారు. ఈ ఎన్‌పిఎస్‌లో ఎలాండి డిఎలు ఉండవని తెలిపారు. విద్యారంగ ప్రైవేటీకరణను దబాస్ విమర్శించారు. ఉపాధ్యాయులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమిస్తున్నారని, వీరికి ఎలాంటి సామాజిక భద్రత ఉండదని అన్నారు. ఇటీవల కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఒపిఎస్‌ను పునర్దరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, అందుకే ఆ పార్టీకి అనుకూలంగా ఓటర్లను సమీకరించామని చెప్పారు. తమ డిమాండ్ల అమలు కోసం అక్టోబర్ 27 వరకూ కేంద్రానికి గడువు ఇచ్చామని, అప్పటిలోగా అమలు చేయలేకపోతే మరిన్ని పోరాటాలను నిర్వహిస్తామని డాక్టర్ రామచంద్ర దబాస్ తెలిపారు.

ఫ్యాన్సీ కేసులను విచారిస్తామన్న అభిప్రాయం మార్చుకోవాలి : సిజెఐ

న్యూఢిల్లీ : సామాన్యుల వెతలకు సంబంధించిన విషయాలు కాకుండా ఫ్యాన్సీ అంశాలను విచారించేందుకు రాజ్యాంగ ధర్మాసనాలను సుప్రీంకోర్టు ఏర్పాటు చేస్తోందన్న భావనను మనస్సులోంచి తుడిచిపెట్టాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ శుక్రవారం ఒక లాయర్‌ను కోరారు. 370వ అధికరణను రద్దు చేయడాన్ని సవాలు చేయడం వంటి కేసుల్లో మొత్తంగా కాశ్మీరు లోయకు చెందినవారి వాదనలతో సహా మొత్తంగా దేశం వాణిని కోర్టు విందన్నారు. రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించే కేసులను విచారిస్తూ సుప్రీం కోర్టు తన సమయాన్ని వృధా చేస్తోందని, దానికన్నా సామాన్యుడికి లబ్ది చేకూర్చే ప్రజా ప్రయోజన కేసులు విచారించడంపై దృష్టి పెట్టాలని న్యాయవాది మాథ్యూస్ నెడుంపురా సూచించారు. "మీరు గనక మొన్న కోర్టుకు వచ్చి కూర్చున్నట్లైతే లైట్ మోటార్ వెహికల్‌ను నడిపే వ్యక్తి కమర్షియల్ వాహనాన్ని నడపవచ్చా లేదా అన్న అంశంపై దేశవ్యాప్తంగా వేలాదిమంది డ్రైవర్ల జీవనోపాధికి సంబంధించిన అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనంలో విచారించాం, అందువల్ల సామాన్యుల జీవితాలకు సంబంధించినవి కాకుండా ఏవో ఫ్యాన్సీ విషయాలను మాత్రమే రాజ్యాంగ ధర్మాసనాల్లో విచారిస్తామన్న అంశం సరికాదు, న్యాయవాది అభిప్రాయం తప్పు' అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు.

ఆస్ట్రేలియా నుంచి యాంటీ బాడీ డోసులు : ఐసిఎంఆర్

న్యూఢిల్లీ : నిఫా వైరస్ ఇన్‌ఫెక్షన్ చికిత్స కోసం ఆస్ట్రేలియా నుంచి మరో 20 డోసుల మోనోక్లోనల్ యాంటీబాడీని భారత్ కొనుగోలు చేస్తుందని ఐసిఎంఆర్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ బహ్ల్ శుక్రవారం తెలిపారు. '2018లో ఆస్ట్రేలియా నుంచి మోనోక్లోనల్ యాంటీబాడీ డోసులు కొనుగోలు చేశాం. ప్రస్తుతానికి 10 మంది రోగులకు డోసులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దేశంలో ఇప్పటివరకు ఎవరికీ ఈ ఔషధం ఇవ్వలేదన్నారు. 'ఇంకో ఇరవై డోసులు సేకరిస్తున్నాం. ఇన్ఫెక్షన్ ప్రారంభ దశలోనే ఈ ఔషధం ఇవ్వాలి' అని తెలిపారు. మరణాల విషయంలో పోలిస్తే కోవిడ్ (2 నుంచి 3 శాతం) కన్నా నిఫాలో మరణాల శాతం (40 శాతం నుంచి 70 శాతం) అధికమని తెలిపారు. కేరళలో ఈ నిఫా వైరస్ సోకిన వారందరూ మొదటి రోగికి సంబంధం ఉన్నవారేనని చెప్పారు. మోనోక్లోనల్‌కు సంబంధించి ఫేజ్ 1 పరీక్షలు విదేశాల్లో జరిగాయన్నారు. విదేశాల్లో ఈ నిఫా వైరస్ సోకిన 14 మందికి మోనోక్లోనల్ యాంటీబాడీ ఇవ్వగా, వారందరూ కోలుకున్నారని తెలిపారు. ఈ ఔషధాన్ని ఉపయోగించడం వైద్యులు, రోగి బంధువులు, కేరళ ప్రభుత్వం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు.

83 మందికి నెగిటివ్ : కేరళ మంత్రి వీణాజార్జి

కేరళలో గత నెల 30న మరణించిన వ్యక్తికి వైద్య సేవలందించిన 30 మంది ఆరోగ్య కార్యకర్తలకు నిఫా టెస్టులు నిర్వహించగా, నెగిటివ్‌గా వచ్చిందని కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జి తెలిపారు. ఆయనతో కాంటాక్టులో ఉన్న మరో 53 మందికి కూడా నెగిటివ్‌గా వచ్చిందని చెప్పారు. తాజాగా కొయ్‌కోడ్‌కు చెందిన 39 ఏళ్ల వ్యక్తికి నిఫా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఈ వైరస్ ఇన్ఫెక్షన్ల సంఖ్య ఆరుకు పెరిగింది. వీరిలో ఇప్పటికే ఇద్దరు మరణించారు. నిఫా వ్యాప్తిని కట్టడిలో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఏడు పంచాయతీలను కంటైన్‌మెంట్ జోన్లుగా ప్రకటించింది. నిఫా వ్యాప్తి నేపథ్యంలో అటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలూ అప్రమత్తమయ్యాయి.

రూ. 45 వేల కోట్ల మిలిటరీ హార్డ్‌వేర్ కొనుగోళ్లకు

- రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం

న్యూఢిల్లీ : 12 ఎస్‌యు-30 ఎంకెఐ ఫైటర్ జెట్‌లు, ధ్రువస్త్ర ఎయిర్-టు సర్ఫేస్ క్షిపణుల కొనుగోలుతోపాటు డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల అప్‌గ్రేడ్‌తో సహా సుమారు రూ.45 వేల కోట్ల విలువైన మిలటరీ హార్ట్‌వేర్ కొనుగోలుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. "డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డిఎసి) చేసిన రూ.45,000 కోట్ల విలువైన తొమ్మిది కొనుగోళ్లకు అవసరమైన ఎఒఎన్‌ను ఆమోదించాం' అని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొనుగోళ్లకు ఆమోదం లభించింది. దేశ రక్షణ, దాడి సామర్థ్యాన్ని ప్రోత్సహించే విధంగా కొనుగోళ్లు ఉంటాయని తెలిపింది.

51 లక్షలు విరాళంగా ఇచ్చేసిన హిమాచల్ సిఎం

సిమ్లా: భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన హిమాచల్ ప్రదేశ్‌ను ఆదుకొనేందుకు పలు సంస్థలు, వ్యక్తులు విరాళాలు అందిస్తున్నారు. తాజాగా హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు తన మూడు వ్యక్తిగత సేవింగ్స్ ఖాతాల్లో ఉన్న రూ.51లక్షల మొత్తానికి సంబంధించిన విరాళం చెక్కును తన సతీమణితో కలిసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేశారు. వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన హిమాచల్‌ప్రదేశ్‌లో బాధితులకు సాయం అందించేందుకు వీలుగా రాష్ట్ర విపత్తు సహాయ నిధికి సాధారణ ప్రజలు, పలు సంస్థలు ఉదారతతో సహకరించాలని గతంలో సిఎం విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తికి స్పందించిన వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు, సంస్థలు, వ్యక్తులు ముందుకొచ్చి విరాళాలను విరివిగా అందిస్తున్నారు. చిన్నారులు సైతం తమ పిగ్గీ బ్యాంకుల నుంచి డబ్బులు తీసుకొని విపత్తు సహాయ నిధికి ఇస్తున్నారు.

జాతీయ విపత్తుగా పరిగణించండి ప్రధానికి ప్రియాంకగాంధీ లేఖ

హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాల కారణంగా సంభవించిన విధ్వంసాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి, పూర్తిస్థాయిలో సహాయం చేయాలని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆమె ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు. బుధవారం ఆమె సిమ్లాలో కొండ చరియలు విరిగిపడటంతో జరిగిన నష్టాన్ని సిఎం సుఖ్వీందర్‌సింగ్ సుఖుతో కలిసి పరిశీలించారు. ఈ విపత్తు వల్ల వేల కోట్ల ఆస్తినష్టం సంభవించిందని ప్రియాంక పేర్కొన్నారు. ఇప్పటివరకూ 428 మంది ప్రాణాలు కోల్పోయారని, వేల సంఖ్యలో పశువులు, పక్షులు, పెంపుడు జంతువులు మరణించాయని, 13 వేలకుపైగా ఇళ్లు, భవనాలు, పూర్తిగా లేదా పాక్షికంగా దెబ్బతిన్నాయని వివరించారు.

డెట్రాయిట్‌లో భారీ సమ్మె



- ఒక్కసారిగా 13 వేల మంది కార్మికుల ఆందోళన

వాషింగ్టన్ : మెరుగైన వేతనాలు చెల్లించాలని కోరుతూ డెట్రాయిట్‌లోని మూడు ఆటోమేకర్స్‌కు (వాహన తయారీ కంపెనీలు) చెందిన 13,000 మంది కార్మికులు శుక్రవారం సమ్మెకు దిగారు. నాలుగేళ్ల కాంట్రాక్టు గురువారంతో ముగియడంతో .. మూడు కంపెనీలకు చెందిన యూనియన్ సభ్యులు ఏకకాలంలో ఆందోళన చేయడం అమెరికా 88 ఏళ్ల చరిత్రలో తొలిసారి. కార్మికుల డిమాండ్లపై సంస్థలకు, యునైటెడ్ ఆటోవర్కర్స్ యూనియన్ నేతలకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. మిస్సోరిలోని వింట్జ్‌విల్లె నగరంలోని మోటార్స్ ప్లాంట్, మిచిగాన్‌లోని ఫోర్డ్ ఫ్యాక్టరీ, ఒహియోలోని స్టెల్లాంటిస్ జీప్ ప్లాంట్ వద్ద పికెటింగ్ ప్రారంభించారు. కోటీ 25 లక్షల మంది సభ్యత్వం కలిగిన 60 యూనియన్ల సమాఖ్య అయిన ఎఎఫ్ఎల్-సిఐఒ అధ్యక్షుడు లిజ్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికులు ఈ సమ్మెను పరిశీలిస్తున్నారని అన్నారు. నాలుగేళ్లలో 36 శాతం కన్నా వేతనాల పెంపుదల తక్కువగా ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవన వ్యయం భారీగా పెరిగిపోతున్నా.. అందుకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని విమర్శించారు. పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని, పదవీ విరమణ చేసినవారికి పెన్షన్లు పెంచాలని, 36 గంటల వారానికి 40 గంటల వేతనం చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

అనంతనాగ్ కాల్పుల్లో మరో జవాన్ మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలో 60 గంటలకు పైగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో జవాన్ మరణించారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్లు అధికారులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇప్పటికే ముగ్గురు భద్రతా సిబ్బంది మరణించిన సంగతి తెలిసిందే. గురువారం జవాను గల్లంతు కాగా, ఆయన మృతదేహాన్ని శుక్రవారం కనుగొన్నారు. కొకెర్‌నాగ్ అడవుల్లో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో సైన్యం, పోలీసులు బుధవారం తెల్లవారు జామున కూంబింగ్ చేపట్టారు. ఉగ్రవాదుల కాల్పుల్లో. రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ (19ఆర్ఆర్) కమాండింగ్ అధికారి మన్‌ప్రీత్ సింగ్, ఆర్మీ మేజర్ మనోజ్ ఆశీష్ ధోన్‌చక్, జమ్ముకాశ్మీర్ పోలీసుకు చెందిన డిఎస్‌పి స్థాయి అధికారి హుమన్యూన్ ముజాహిల్‌భట్ తీవ్ర గాయాలతో మరణించినట్లు బుధవారం సాయంత్రం అధికారులు ధ్రువీకరించారు. దట్టమైన అడవుల్లో ఉన్న ఉగ్రవ్వాదులను బంధించాలనే ఉద్దేశంతో భద్రతా బలగాలు అడవులను జల్లెడ పడుతున్నాయి. ఇందుకోసం కొత్త తరహా ఆయుధాలు, స్ట్రైక్ సామర్థ్యం ఉన్న హెరాన్ డ్రోన్లను వినియోగిస్తున్నారు. మరణించిన సిబ్బంది మృతదేహాలను బయటకు తీసుకురావడం కూడా ఇబ్బందిగా మారింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. అధికారులు దీనిని ధ్రువీకరించలేదు.

కర్ణాటక విద్యాసంస్థల్లో రాజ్యాంగ పీఠిక చదవడం తప్పనిసరి

బెంగళూరు : పాఠశాలలు, కళాశాలల్లో ఉదయం ప్రార్థనా సమయంలో తప్పనిసరిగా రాజ్యాంగ పీఠికను చదవాలని కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు ఈ నియమాన్ని తప్పనిసరిగా పాటించాలని గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అసెంబ్లీ సమీపంలో రాజ్యాంగ పీఠికను చదివారు. అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సిఎం సహా డిప్యూటీ సిఎం డికె శివకుమార్, మంత్రులు జి.పరమేశ్వర, రామలింగారెడ్డి, ఈశ్వర్ ఖండ్రే, కెజె జార్జ్, ఎమ్మెల్యే రిజ్వాన్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హెచ్‌సి మహదేవప్ప మాట్లాడుతూ.. 'మన రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక విధులను పౌరులు నిర్వర్తించాలి. అందుకే పాఠశాలలు, కళాశాలల్లో రాజ్యాంగ ప్రవేశికను చదవడం తప్పనిసరి చేశాం. దాంతో పిల్లలకు రాజ్యాంగ విధుల గురించి తెలుస్తుంది. ఏ ఆదర్శాలు, సూత్రాల ఆధారంగా రాజ్యాంగం రూపొందించారో వారికి అవగాహన వస్తుందని' చెప్పారు.

తెలంగాణలో తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్, కామారెడ్డి, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కుమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం మెడికల్ కాలేజీలను సిఎం కెసిఆర్ వర్చువల్‌గా ప్రగతి భవనం నుంచి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. గతంలో ఐదు మెడికల్ కాలేజీలుంటే ప్రస్తుతం అవి 26కు చేరుకున్నాయని, ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల హామీని అతి త్వరలోనే నెరవేర్చుతామని చెప్పారు. 2014లో 2,850 ఎంబిబిఎస్ సీట్లుండగా 8,515 సీట్లకు పెరిగాయని తెలిపారు. నీట్‌కు పోను 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకు దక్కాలని విడుదల చేసిన జిఒపై వివాదం చెలరేగినా మంత్రి, వైద్యశాఖ సిబ్బంది పటిష్టమైన న్యాయపోరాటం చేసి హైకోర్టులో కూడా విజయం సాధించడాన్ని అభినందించారు. రాబోయే ఆర్థిక సంవత్సరం 2024-25లో జోగులాంబ గద్వాల, ములుగు, మెదక్, నారాయణపేట, వరంగల్(నర్సంపేట), యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో మెడికల్ కాలేజీలు ప్రారంభమవుతాయని తెలిపారు.




మీకోసం

ఫ్రిజ్ నుంచి చెడువాసన వస్తుంటే ఒక నిమ్మకాయను సగానికి కోసి ఓ మూలన పెట్టాలి.

జీవన సౌరభం

నీకు కావాల్సిన దాని గురించి శ్రమించకుండా పోగొట్టుకున్న దాని గురించి ఏడవడం మూర్ఖత్వం.

చిట్టి తమ్ముడు



అట్లను తిన్నాడు
బిస్కట్లను తిన్నాడు
చిట్టి తమ్ముడు మెట్లు ఎక్కి
జాకట్లారేసాడు

పక్కగంతలో కాల్వకు
గట్టి గట్లు వేసినాడు
నాటిన మొక్కలు పీకిన
పిల్లను తిట్లు తిట్టినాడు

పట్ల కర్రతో గదిలో
మూలల పట్లు దులిపినాడు
ధూళిపడిందని పైకి తీసి
దుప్పట్లు దులిపినాడు

వదులైపోయిన కుర్చీ మూలల
నట్లు బిగించాడు
కట్ల పాముని పొట్ల కాయతో
బెదర గొట్టినాడు

కొమ్మకు చేరిన పిట్టకు
సెల్‌తో ఫొటోలు తీసాడు
తుర్రున ఎగిరిన పిట్టను
చూసి ఆనందించాడు!

- ఎన్.వి.ఆర్ సత్యనారాయణ మూర్తి

తప్పు పదం	సరైన పదం
మోఆదం	
కన్నిమ	
కుసరు	
పాఅయం	
దీసుర్ఘం	
లంలిచకా	

సరిచేసి రాయండి

పిల్లలూ,
ఇక్కడ తికమకగా ఇచ్చిన అక్షరాలను సరైన క్రమంలో రాస్తే అర్థవంతమైన పదం వస్తుంది. ట్రై చేయండి మరి!

నేను గీసినబొమ్మ





ఆర్ లక్ష్మిసూర్యకుమారి,
4వ తరగతి, ఎంపిపిఎస్ చిల్లకళ్లు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వ్యర్థాలకు సరికొత్త అర్థాలు

ఇప్పుడు
ఏ సరుకు కొన్నా దాని చుట్టూ ఓ ప్యాకింగు ఉంటుంది. షాపు నుంచి ఇంటికి చేరేవరకే దాని అవసరం ఉంటుంది. ఆ తరువాత అది నిరుపయోగ వస్తువుగా చెత్తబుట్టలోకి చేరుతుంది. ఇలాంటి చెత్త ఏ ఊరిలో చూసినా అంతకంతకు పెరిగిపోయి, పర్యావరణానికి అనేక రూపాల్లో నష్టం తెస్తోంది. మరి అలాంటి వ్యర్థ పదార్థాల్లోంచి ఉపయోగ వస్తువులను తయారు చేసి, పర్యావరణానికి హితం చేకూరుస్తోంది పార్వతీపురం మన్యం జిల్లాలోని పునర్వ్ స్వచ్ఛంద సేవాసంస్థ.



సరిగ్గా పాతికేళ్ల క్రితం వెనిగండ్ల పద్మజ గ్రూప్-1 ఉద్యోగి. ప్రజాసేవపై మక్కువతో ఉద్యోగాన్ని వదిలేసి, అప్పటికే నడుస్తున్న జట్టు సంస్థలో చేరారు. గిరిజన అనాథ పిల్లల ఆశ్రమం నిర్వహిస్తున్న స్వచ్ఛంద సేవకుడు డొల్లు పారినాయుడు నుంచి నిర్వహణ బాధ్యతలు చేపట్టారు. అనాథ పిల్లలను సంరక్షించటం, చదివించటమే కాకుండా మంచి పౌరులుగా తీర్చిదిద్దే విధంగా అనేక చర్యలు చేపట్టారు. ప్రతి నెలా దాతల నుంచి వచ్చే ఆర్థిక సహాయం కోసం ఎదురు చూడకుండా ఆశ్రమానికి స్వయం సమృద్ధిగా ఆదాయం పెంచుకోవాలనే దిశగా ఆలోచించారు.



మిత్రురాలు రజనీ దంపతుల సహకారంతో ఆశ్రమంలోని బాలబాలికలకు సాధారణ విద్యతోపాటు భారతీయ నాట్య రీతుల్లో శిక్షణ ఇప్పించారు. ఇంకా సంగీతం, చిత్రలేఖనం, కర్రసాము, మార్షల్ ఆర్ట్స్ నేర్పించి వారి చేత రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇప్పించారు. దేశ విదేశాల్లో ప్రఖ్యాతి గాంచిన నాట్య కళాకారులను జట్టు ఆశ్రమానికి ఆహ్వానించి వారిచే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఇలా ఇక్కడ ఆశ్రయం పొందిన పలువురు బాలల నేడు వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. వారంతా కూడా పద్మజకు అండగా ఉంటున్నారు. ఈ క్రమంలో పర్యావరణవేత్త శరవరణ్ రాజగోపాలన్ సహకారంతో రూపుదిద్దుకున్న సంస్థే 'పునర్వ్'.

మరింత సహాయం కావాలి

పునర్వ్ సంస్థ ద్వారా పర్యావరణ పరిరక్షణకు మా వంతుగా శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నాం. ఈ ప్రయత్నానికి ప్రభుత్వం నుంచి, దాతల నుంచి సహాయం కోరుతున్నాం. పార్వతీపురం పట్టణంలో గుట్టలుగా పడి ఉన్న చెత్త సమస్యను మేము అవలీలగా పరిష్కరించగలమనే నమ్మకం నాకుంది. ఇప్పటికే చెత్తను నిర్మూలించే కృషిని పెద్దఎత్తున చేపట్టాం. మరింత సహాయం అందితే ఆ కృషిని మరింత విస్తృతంగా, మరింత వేగంగా చేయగలం.

- వెనిగండ్ల పద్మజ
పునర్వ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు



ఆర్గానిక్ పంటలతో ఆదాయం

అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని సేంద్రియ పద్ధతుల్లో కూరగాయలు, పండ్లు సాగుచేశారు. అమ్మ పచ్చళ్లు పేరిట తయారీ యూనిట్‌ను స్థాపించి రసాయనాలు లేని, నిల్వవుండే తాజా పచ్చళ్ల అమ్మకాలు ప్రారంభించారు. ఈ విధంగా ఆశ్రమానికి ఆర్థిక వనరులు మెరుగుపర్చారు. "పర్యావరణ పరిరక్షణకు చెట్లను నాటడంతోనే సరిపోదు. రైతులు రసాయనాలు ఉపయోగించుకోకుండా వ్యవసాయం చేయాలి. తద్వారా సాగు ఖర్చులు తగ్గించుకోవొచ్చు. భూసారాన్ని పరిరక్షించుకోవచ్చు. జీవం ఉన్న పంటలు పండించుకోవచ్చు." ఇలా పార్వతీపురం పరిసర ప్రాంతాల్లోని రైతులకు అవగాహన కల్పించారు. పార్వతీపురం మండలంలోని తాళ్ళబురిడి, ములగ; కొమరాడ మండలంలోని కుమ్మరిగుంట గ్రామాల్లో పలువురు రైతులు ఎరువులు, పురుగుమందులు వాడకుండా పశువుల పెంట, పంట వ్యర్థాలతో ఎరువులను తయారు చేయిస్తూ సహజ సిద్ధమైన వ్యవసాయం చేయిస్తున్నారు. వారి ఉత్పత్తులకు మంచి డిమాండు లభిస్తోంది.

వ్యర్థాలకు సరికొత్తగా అర్థాలు

నేడు అన్నిచోట్లా విపరీతమైన చెత్త పేరుకుపోయి, ఎక్కడ చూసినా కలుషిత వాతావరణం ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించాలంటే పరిసరాల్లో ఉన్న వ్యర్థాలను తడి- పొడిచెత్తగా సేకరించి వాటిని ఉపయోగించుకోవటం ద్వారా ఎరువులు, రీ సైక్లింగ్ ముడిసరుకుగా మార్చుకోవచ్చని పద్మజ భావించారు. చెత్తను విభజించి, పునరుత్పాదక పదార్థాలుగా మార్చి వాటికి ఒక అర్థం కల్పిస్తున్నారు. చెత్త నుంచి సంపద ఉపయోగించుకోవటం తెలియాలి గానీ ప్రపంచంలో వ్యర్థ పదార్థం అనేదే లేదంటూ ఇక్కడి చెత్త నుంచి సంపద కేంద్రం నిరూపిస్తోంది. కొద్దిపాటి యంత్రాలను ఉపయోగించి వ్యర్థాలతో కొత్త ఉత్పత్తులకు సరికొత్త రూపాన్ని సృష్టిస్తున్నారు. పార్వతీపురం పట్టణంతోపాటు పలు గ్రామాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తమ ఆశ్రమానికి అందించిన వ్యర్థ పదార్థాలతో గాజు పెంకులు, అద్దం ముక్కలు, వాడేసిన గాజుసీసాలను గ్రైండింగ్ చేసి, ముదుగు అద్దాలను తయారు చేసి పరిశ్రమలకు ముడి సరుకుగా అందిస్తున్నారు.

వాడిపారేసిన ప్లాస్టిక్ కవర్లను, పేపర్లను సేకరించి వాటిని బేళ్లుగా తయారుచేసి రీ సైక్లింగ్ చేసే ప్లాస్టిక్ పరిశ్రమలకు అందజేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలకు కాస్త సిమెంట్ జత చేసి ఫ్లోరింగ్‌లకు ఉపయోగించే ఇటుకలను తయారు చేస్తున్నారు. వాటితోనే పూలకుండీలను తయారుచేసి అందులో వివిధ మొక్కలను పెంచుతున్నారు. వాటిని చెత్తను తీసుకొచ్చి ఆశ్రమానికి అందిస్తున్న దాతలకు బహుమతులుగా అందిస్తున్నారు. ఇలా వ్యర్థ పదార్థాలను అర్థవంతంగా మార్చి, చెత్త సముదాయాల్లోంచి అందాన్ని, ఆదాయాన్ని సృష్టిస్తున్నారు పద్మజ. ఆమె కృషి అభినందనీయం.

- నాగు కాకిముక్కల
ప్రజాశక్తి, పార్వతీపురం రూరల్
94400 81649

'స్ప్రెడ్డింగ్ ఖుషి'



'నాకు ఇప్పుడు నిజమైన సంతోషం, సంతృప్తి లభించాయని భావిస్తున్నా. మీరంతా కూడా ఆనందంగా ఉన్నారని అనుకుంటున్నా. నేను ఆరోగ్యంగా పనిచేస్తున్నంత కాలం ప్రతి ఏడాది ఏదో ఒక సాయం చేస్తూనే ఉంటా. ఇవన్నీ నా వ్యక్తిగత కోరికలు. చిన్నప్పుడు మా ఆర్థిక పరిస్థితి బాగలేక నేను కొన్ని ఆనందాలకు దూరమయ్యాను. అందుకే ఇప్పుడు నా సంపాదనలో ఇలా సాయం చేస్తున్నా. మా తమ్ముడి ఇంజనీరింగ్ ఫీజు కట్టడానికి మా తల్లిదండ్రులు చాలా ఇబ్బంది పడ్డారు. ఎవరైనా రూ.లక్ష ఇస్తే బాగుండని అప్పుడు అనుకున్నా. ఇప్పుడు నేనిచ్చిన ఈ రూ.లక్ష మీకు ఏదోరకంగా ఉపయోగపడి మీ అవసరాలు తీరితే అదే చాలు. మీరు నాపై చూపించే ప్రేమాభిమానాలకు ఎప్పటికీ రుణపడి ఉంటా' అని విజయ్ దేవరకొండ అన్నారు. అలాగే డబ్బులు అందుకున్న వారు ఎవరూ తనకు థ్యాంక్స్ చెప్పొద్దని విజయ్ కోరారు. అభిమానం చాలని అన్నారు. తాజాగా 'ఖుషి' సక్సెస్ మీట్‌లో ఆయన ఇచ్చిన మాట ప్రకారం ఎంపిక చేసిన వంద కుటుంబాలకు శుక్రవారం లక్ష రూపాయల చెక్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయ్ పైవిధంగా స్పందించారు. దీనికి సంబంధించిన వీడియోను తన సోషల్ మీడియాలో ఖాతాలో పంచుకుని, దానికి 'స్ప్రెడ్డింగ్ ఖుషి' అనే హ్యాష్ ట్యాగ్‌ను జోడించారు.



'డెవిల్' ఫస్ట్ సింగిల్ ప్రోమో

ప్రస్తుతం కళ్యాణ్ రామ్ 'డెవిల్' సినిమాతో చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ 'మాయే చేశావే' ప్రోమోను చిత్రబృందం విడుదల చేసింది. హర్షవర్ధన్ రామేశ్వర్ స్వర పరిచిన ఈ పాటను సిద్ శ్రీరామ్ ఆలపించాడు. ఈ పాట ఫుల్ లిరికల్ వీడియోను సెప్టెంబర్ 19న రిలీజ్ చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. దేశ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా 'డెవిల్' ముసుగేసుకుని బ్రిటీషర్ల కోసం కళ్యాణ్‌రామ్ ఎందుకు పని చేశాడనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కినట్లు తెలుస్తోంది. అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నవీన్ మేడారం దర్శకత్వం వహించారు.

మరో కన్నడ సినిమా తెలుగులో



కన్నడ నటుడు రక్షిత్ శెట్టి హీరోగా తన సొంత నిర్మాణంలో తెరకెక్కించిన చిత్రం 'సప్త సాగరదాచె ఎల్లో'. ఈ సినిమా అక్కడ భారీ విజయం అందుకోవడంతో ఇప్పుడు దీన్ని తెలుగు డబ్బింగ్ చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ డబ్బింగ్ హక్కులు సొంతం చేసుకున్నారు. తెలుగులో 'సప్త సముద్రాలు దాటి' అనే పేరుతో సెప్టెంబర్ 22న ఈ సినిమా రిలీజ్ చేస్తున్నట్టు నిర్మాణసంస్థ ప్రకటించింది. ఈ చిత్రాన్ని హేమంత్ ఎం రావు తెరకెక్కించారు.

మళ్లీ మెగా ఫోన్ పట్టిన ఉపేంద్ర



దాదాపు ఏడేళ్ల గ్యాప్ తరువాత 'యుఐ' సినిమాతో మళ్లీ మెగాఫోన్ పట్టారు కన్నడ నటుడు ఉపేంద్ర. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా ఈ సినిమా టీజర్ అప్‌డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. మనోహరన్-శ్రీకాంత్ కేపి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో ఉపేంద్రకు జోడీగా రీష్మా నానయ్య నటిస్తుంది. కాంతర ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం సమకూర్చుతున్నారు.



సముద్రగర్భంలో 'ఆక్వామాన్' విన్యాసాలు

హాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు వార్నర్ బ్రదర్స్, డీసీ కామిక్స్ సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ఆక్వామాన్ (2018) చిత్రానికి 'ఆక్వామ్యాన్ అండ్ ది లాస్ట్ కింగ్‌డమ్' పేరుతో సీక్వెల్ రానుంది. జేమ్స్‌వాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నుండి తాజాగా ట్రైలర్ విడుదలైంది. జాసన్ మోమోవా, అంబర్ హర్డ్ ఇందులో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ ట్రైలర్‌లో ఆక్వామాన్ సముద్ర గర్భంలో ఉన్న అట్లాంటిస్ ప్రపంచానికి సముద్ర రాజుగా పట్టాభిషేకం చేస్తాడు. అయితే ఆక్వామాన్ రాజుగా ఉండడం నచ్చని బ్లాక్ మాన్టా, సముద్ర రాజును అతడి కుటుంబాన్ని నాశనం చేయాలనీ చూస్తాడు. ఈ క్రమంలో అట్లాంటిస్‌ను కాపాడుకోవడానికి ఆక్వామాన్ ఏమి చేస్తాడు అనేది సినిమా స్టోరీ. ఈ సినిమా డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. పాట్రిక్ విల్సన్, యాహ్యా అబ్దుల్-మతీన్, రాండాల్ పార్క్, డాల్ఫ్ లండ్‌గ్రెన్, టెమ్యురా మారిసన్, నికోల్ కిడ్‌మాన్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

శుభ్‌మన్ సెంచరీ వృథా

బంగ్లాదేశ్ చేతిలో ఆరు పరుగుల తేడాతో ఓటమి • 17న భారత్ × శ్రీలంక మధ్య టైటిల్ పోరు



కొలంబో: నామమాత్రపు చివరి సూపర్-4 మ్యాచ్‌లో టీమిండియా బంగ్లాదేశ్ చేతిలో ఓటమిపాలైంది. సీనియర్ బౌలర్లు బుమ్రా, సిరాజ్, కుల్దీప్ బెంచ్‌కే పరిమితం కావడం, బ్యాటర్లు కోహ్లి, హార్దిక్ విశ్రాంతి జట్టు ఫలితంపై ప్రభావం చూపాయి. ప్రేమదాస స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 265పరుగులు చేసింది. ఛేదనలో భారతజట్టు 49.5 ఓవర్లలో 259పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్(121) సెంచరీతో కదం తొక్కినా.. మిగతా బ్యాటర్స్ నిరాశపరిచారు. కెప్టెన్ రోహిత్ శర్మ(0), తిలక్‌వర్మ(5), ఇషాన్(5), జడేజా(7) సింగిల్ డిజిట్‌కే ఔటయ్యారు. చివర్లో అక్షర్(42) పోరాడినా.. విజయానికి టీమిండియా 9 బంతుల్లో 12పరుగులు కావల్సిన దశలో ఔటవ్వడం జట్టు ఫలితంపై ప్రభావం చూపింది. ముస్తాఫిజుర్‌కు మూడు, మెహిదీ, తంజుమ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. అంతకుముందు టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కుద ఇగిన ఓ దశలో 59 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ తర్వాత కెప్టెన్ షకీబ్ అల్ హసన్(80), తౌహిద్ హ్రిదోయ్(54) రాణించారు. చివర్లో నసుమ్ అహ్మద్(44), మెహిది హసన్(29నాటౌట్) మెరిసారు. 34.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 161 పరుగులుగా ఉన్న బంగ్లా స్కోర్.. ఆ తర్వాత 15.5 ఓవర్లలో ఏకంగా 104 పరుగులు జోడించి, 265 పరుగులు చేసింది. శార్దూల్‌కు మూడు, ప్రసిధ్ కృష్ణ, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ ఒక్కో వికెట్ తీసారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్-అల్-హసేన్‌కు లభించింది.

స్కోర్‌బోర్డు..

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తంజిద్ హసన్ (బి)శార్దూల్ 13, లింటన్ దాస్ (బి)షమీ 0, అనముల్ (సి)రాహుల్ (బి)శార్దూల్ 4, షకీబ్ (బి)శార్దూల్ 80, మెహిదీ హసన్ (సి)రోహిత్ (బి)అక్షర్ 13, తౌహిద్ హందాయ్ (సి)తిలక్ వర్మ (బి)షమీ 54, షమీమ్ (ఎల్‌బి)జడేజా 1, నసుమ్ అహ్మద్ (బి)ప్రసిద్ 44, మెహిదీ హసన్ (నాటౌట్) 29, తంజిమ్ (నాటౌట్) 14, (అదనం 13. (50 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 265పరుగులు. **వికెట్ల పతనం:** 1/13, 2/15, 3/28, 4/59, 5/160, 6/161, 7/193, 8/238 **బౌలింగ్:** షమీ 8-1-32-2, శార్దూల్ 10-0-65-3, ప్రసిధ్ 9-0-43-1, అక్షర్ 9-0-47-1, తిలక్ వర్మ 4-0-21-0, జడేజా 10-1-53-1.

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ (సి)అన్ముల్ (బి)తంజిమ్ 0, శుభ్‌మన్ (సి)తౌహిద్ (బి)మోహిదీ 121, తిలక్ వర్మ (బి)తంజుమ్ 5, కేఎల్ రాహుల్ (సి)షమీమ్ (బి)మోహిదీ 19, ఇషాన్ కిషన్ (ఎల్‌బి)మెహిదీ 5, సూర్యకుమార్ (బి)షకీబ్ 26, జడేజా (బి)ముస్తాఫిజుర్ 7, అక్షర్ పటేల్ (సి)తంజిద్ (బి)ముస్తాఫిజుర్ 42, శార్దూల్ (సి)మెహిదీ (బి)ముస్తఫిజుర్ 11, షమీ (రనౌట్) తంజిద్/లింటన్ దాస్) 6, ప్రసిధ్ కృష్ణ (నాటౌట్) 0. (49.5 ఓవర్లలో ఆలౌట్) 259పరుగులు. **వికెట్ల పతనం:** 1/2, 2/17, 3/74, 4/94, 5/139. 6/170, 7/209, 8/249, 9/254, 10/259 **బౌలింగ్:** తంజిమ్ 7.5-1-32-2, ముస్తాఫిజుర్ 8-0-50-3, నజుమ్ అహ్మద్ 10-0-50-0, షకీబ్ 10-2-43-1, మెహిదీ హసన్ 9-1-50-2, హసన్ మిరాజ్ 5-0-29-1.

2వ ర్యాంక్‌కు ఎగబాకిన భారత్

ఐసిసి వన్డే ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ సత్తా చాటింది. ఐసిసి శుక్రవారం విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత్ 116రేటింగ్ పాయింట్లతో 2వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న పాకిస్తాన్‌ను ఆసియాకప్ సూపర్-4లో టీమిండియా చిత్తుచేయడంతో ర్యాంకింగ్ మెరుగైంది. ఇక పాకిస్తాన్ జట్టు నిర్ణయాత్మక మ్యాచ్‌లో శ్రీలంక చేతిలోనూ ఓటమితో తాజా ర్యాంకింగ్స్‌లో 3వ స్థానానికి పడిపోయింది. ఇక ఆస్ట్రేలియా జట్టు భారత్‌కంటే రెండు పాయింట్లు ఎక్కువగా ఉన్న దృష్ట్యా టాప్ ర్యాంక్‌కు చేరకుంది. దీంతో త్వరలో భారత్ వేదికగా జరిగే ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జట్టు టాప్ ర్యాంక్‌తో, భారత్ 2వ, పాకిస్తాన్ 3వ ర్యాంక్‌తో బరిలోకి దిగనున్నాయి. మరోవైపు దక్షిణాఫ్రికా పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియా జట్టు తొలి రెండు వన్డేల్లో ఘన విజయం సాధించి టాప్ ర్యాంక్‌కు చేరింది.

మలన్ సెంచరీ

ఇంగ్లండ్ 311/9

లండన్: న్యూజిలాండ్‌తో జరుగుతున్న నాల్గో వన్డేలో ఇంగ్లండ్ ఓపెనర్ డేవిడ్ మలాన్(127) సెంచరీతో కదం తొక్కాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 311 పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో మలన్ ఒక్కడే రాణించగా.. మిగతా ఆటగాళ్లంతా నామమాత్రపు స్కోర్లకే పరిమితమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో రచిన్ రవీంద్రకు నాలుగు, డారిల్ మిచెల్, మ్యాట్ హెన్రీకి రెండేసి వికెట్లు దక్కాయి.



కుమ్మేసిన క్లాసెన్

దక్షిణాఫ్రికా 416/5 • ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్

సెంచూరియన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాల్గో వన్డేలో దక్షిణాఫ్రికా వికెట్ కీపర్, బ్యాటర్ హెన్రిక్ క్లాసెన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 83 బంతుల్లో 13ఫోర్లు, 13సిక్సర్ల సాయంతో ఏకంగా 174పరుగులు చేశాడు. డుస్సెన్(62), డేవిడ్ మిల్లర్(82నాటౌట్) కూడా రాణించడంతో దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 416పరుగులు చేసింది. ఆడం జంపా 10 ఓవర్లలో 113పరుగులు సమర్పించుకున్నాడు. దీంతో వన్డే చరిత్రలో 10 ఓవర్లలో అత్యధిక పరుగులు 2006లో సమర్పించుకొన్న మైక్ లెవీస్(ఆస్ట్రేలియా) సరసన చేరాడు. ఇక ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి రెండు వన్డేల్లో ఆస్ట్రేలియా గెలుపొందగా.. దక్షిణాఫ్రికా జట్టు మూడో వన్డేలో 111 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68